

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు





రైతులను ముంచిందే జగన్

8



ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టిడి జనార్దన్, అలనాటి తార ప్రభ



ఎన్టీఆర్ తొలి హీరోయిన్ కృష్ణవేణికి ఎన్టీఆర్ సినీ ప్రస్థానం పుస్తకాన్ని అందిస్తున్న సీఎం చంద్రబాబు



సీఎం చంద్రబాబుకు ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహం మెమెంటో అందిస్తున్న టీడీ జనార్దన్

# తెలుగుజాతి గుండెచప్పుడు ఎన్టీఆర్

- తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు
- సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర
- జాతీయ భావాలతో ప్రాంతీయ పార్టీ నడిపిన నేత
- ఎన్టీఆర్‌కు భారతరత్న సాధించి తీరుతాం..
- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్
- ప్రగతి కలను సాకారం చేసి చూపిస్తా..
- ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలో చంద్రబాబు ఉద్ఘాటన
- తారక రామం, ఎన్టీఆర్ సినీ ప్రస్థానం పుస్తకాల ఆవిష్కరణ



2

ఎన్టీఆర్ సినీ ప్రస్థానానికి నేటితో 75ఏళ్లు. ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుక అపూర్వ ఘట్టం. గతేడాది ఎన్టీఆర్ శతజయంతి జరుపుకున్నాం. యుగపురుషుడు పుట్టినప్పుడు చరిత్ర మర్చిపోదు అనడానికి ఎన్టీఆర్ ఉదాహరణ. 75ఏళ్ల సినీ వజ్రోత్సవ వేడుక చేసుకోవడం సంతోషాన్నిస్తోంది. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగుజాతి పేరువింటే ముందుగా మనకు గుర్తొచ్చేది ఎన్టీఆర్. చరిత్ర ఉన్నంతవరకూ తెలుగువారి గుండెల్లో ఆయన ఉంటారు. చిన్నరైతు బిడ్డనుంచి తెలుగు సినీ చరిత్రలో ఎవరెస్టు శిఖరంగా ఎదిగి, పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి కావడం చరిత్రలో ఎక్కడా జరగలేదు. భవిష్యత్‌లోనూ జరగదు. ఇటు వెండితెర, అటు రాజకీయాలను ఏలిన ఏకైక నాయకుడు దేశ చరిత్రలో ఒక్క ఎన్టీఆర్ మాత్రమే. రంగంఏదైనా ఆయన అడుగుపెట్టిన ప్రతిచోటా సువర్ణాధ్యాయమే.

-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## ఎన్టీఆర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి: వెంకయ్య

4

## గీత కార్మికులను ప్రోత్సహిస్తా



8

## వైసీపీకి విశ్వసనీయత లేదు

- ఆ పార్టీ నాటకాలు చూసి ప్రజలు నవ్వుతున్నారు
- విజన్ డాక్యుమెంట్‌పై విస్తృతమైన చర్చ జరగాలి
- రేపటి భవిష్యత్ కోసం సిద్ధం చేసిన డాక్యుమెంట్ అది
- విజన్ -2020 సాకారాన్ని నేటితరం తెలుసుకోవాలి
- 'జమిలి' అమల్లోకి వచ్చినా.. ఎన్నికలు '29లోనే
- వచ్చే కలెక్టర్ల సదస్సులో మార్పులు తెస్తున్నాం...
- మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం చంద్రబాబు

7



7

పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినోత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమాలకు ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వం పెద్దఎత్తున నిర్వహిస్తున్న ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజలు హాజరవుతున్నట్లు మంత్రి పార్థసారథి వెల్లడించారు. ఆదివారం కార్యక్రమానికి అధికారులతో కలసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి.

## బాబూ.. నువ్వే దిక్కు!

- కుమార్తెను చంపిన నేరస్తులకు అండగా పోలీసులు
- న్యాయం కోసం స్టేషన్‌కు వెళితే మాపైనే అక్రమ కేసులు
- విడదల రజనీ, లేళ్ల అప్పిరెడ్డి పేరు చెబుతూ వేధించారంటూ తల్లి ఆవేదన
- ఎంతటి వారైనా వదిలేది లేదని, న్యాయం చేస్తానన్న చంద్రబాబు

6



2022లో జరిగిన తన కూతురి హత్యపై విచారణ చేసి న్యాయం చేయాలని సీఎం చంద్రబాబువద్ద విలపిస్తున్న గుంటూరులోని గుజ్జనగుళ్లకు చెందిన మహిళ శంకరలీల



## 50 డేస్.. 73 లాక్స్!

3

- సభ్యత్వ నమోదులో టీడీపీ సరికొత్త రికార్డ్
- కొత్త సభ్యత్వాలు.. 54 శాతం
- టాప్ 5లో రాజంపేట, నెల్లూరు సిటీ, కుప్పం, పాలకొల్లు, మంగళగిరి
- క్యాడర్, నాయకులకు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు అభినందనలు
- ప్రజలు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పదవులు కల్పిస్తాం
- సంక్షేమం అందించడంతో పాటు ఆర్థికంగా ఎదిగేలా కార్యక్రమాలు
- మంత్రులకు పెండింగ్ బిల్లుల పరిష్కార బాధ్యత అప్పగిస్తూ నిర్ణయం

చైతన్యరథం

# తెలుగుజాతి గుండెచప్పుడు ఎన్టీఆర్



అమరావతి (చైతన్య రథం): 'తెలుగుజాతి ఆత్మగౌరవం, పౌరుషం అంటే గుర్తొచ్చేది ఎన్టీఆర్. ఎన్టీఆర్ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర విజన్ -2047 కల సాకారం చేసుకుందాం. మనకు తెలిసిన, మనం చూసిన ఏకైక యుగపురుషుడు ఎన్టీఆర్' అని ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు కొనియాడారు. పోరంకిలో శనివారం సాయంత్రం ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. వేదికపై ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, ఎన్టీఆర్ సినీ ప్రస్థానంపై రూపొందించిన 'తారకరామం', ఎన్టీఆర్ నటించిన మొత్తం చిత్రాల వివరాలు పొందుపర్చిన 'ఎన్టీఆర్ సినీ ప్రస్థానం' పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి వచ్చిన అతిథులు, సినీ ప్రముఖులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

- తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు
- సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర
- జాతీయ భావాలతో ప్రాంతీయ పార్టీ నడిపిన నేత
- ఎన్టీఆర్‌కు భారతరత్న సాధించి తీరుతాం..
- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్
- ప్రగతి కలను సాకారం చేసి చూపిస్తా..
- ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలో చంద్రబాబు ఉద్ఘాటన
- తారక రామం, ఎన్టీఆర్ సినీ ప్రస్థానం పుస్తకాల ఆవిష్కరణ



### చరిత్ర ఉన్నన్నాళ్లు ఎన్టీఆర్ ఉంటారు

'ఎన్టీఆర్ సినీ ప్రస్థానానికి నేటితో 75ఏళ్లు. ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుక అపూర్వ ఘట్టం. గతేడాది ఎన్టీఆర్ శతజయంతి జరుపుకున్నాం. ఏడాది మొత్తం ప్రపంచమంతా ఉత్సవాలు చేసుకున్నాము. యుగపురుషుడు పుట్టినప్పుడు చరిత్ర మర్చిపోదు అనడానికి ఎన్టీఆర్ ఉదాహరణ. 75ఏళ్ల సినీ వజ్రోత్సవ వేడుక చేసుకోవడం, వేదికపై అందరం కలుసుకోవడం సంతోషాన్నిస్తోంది. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లిన తెలుగుజాతి పేరువింటే ముందుగా మనకు గుర్తొచ్చేది ఎన్టీఆర్. చరిత్ర ఉన్నంతవరకూ తెలుగువారి గుండెల్లో ఆయన ఉంటారు. చిన్నరైతు బిడ్డనుంచి తెలుగు సినీ చరిత్రలో ఎవరెస్టు శిఖరంగా ఎదిగి, పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి కావడం చరిత్రలో ఎక్కడా జరగలేదు. భవిష్యత్‌లోనూ జరగదు. ఇటు వెండితెర, అటు రాజకీయాలను ఏలిన ఏకైక నాయకుడు దేశ చరిత్రలో ఒక్క ఎన్టీఆర్ మాత్రమే. రంగంఏదైనా ఆయన అడుగుపెట్టిన ప్రతిచోటా సువర్ణాధ్యాయమే' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

### తెలుగు సినీ పరిశ్రమపై చెరగని సంతకం

'ఎన్టీఆర్ తొలిసారి నటించిన మనదేశం చిత్రం విడుదలైన 75 ఏళ్లు. ఎన్టీఆర్ మొదటి సినిమా హీరోయిన్ కృష్ణవేణి. 102 సంవత్సరాల వయసు లోనూ ఈ వేడుకకు ఆమె హాజరుకావడం ఎంతో గొప్పవిషయం. కారణజన్ముల చరిత్ర మనం గుర్తు చేసుకోని స్ఫూర్తి పొందాలి. నిమ్మకూరులో వెంకట్రావమ్మ, లక్ష్మయ్యచౌదరి దంపతులకు 1923, మే 25న జన్మించిన కారణ జన్ముడు ఎన్టీఆర్. నేను ఆయన్ను కలిసి మాట్లాడినప్పుడు ఎన్నో విషయాలు చెప్పేవారు. చదువుకోసం విజయవాడకు రావడం తల్లికి సాయంగా పాలు అమ్మడం, గుంటూరుకు వెళ్లి చదువుకున్న విషయాలు నాతో పంచుకునేవారు. 1945లో మద్రాసు రైలు ఎక్కాక ఎన్టీఆర్ జైత్ర యాత్ర ప్రారంభమైంది. నెలవారీ జీతం కోసమే ఆయన మొదట ఆలోచించారు.తర్వాత ఎల్వీ ప్రసాద్, నాగిరెడ్డి, చక్రపాణి సహకారంతో సినీ అవకాశాలు వచ్చాయి. ఆపై ఎన్టీఆర్ సాంఘిక, పౌరాణిక, జాన పద, చారిత్రక పాత్రల్లో నటించి ప్రాణం పోశారు. 300 సినిమాల్లో నటించారు. ఏడాదికి 10నుంచి 15 సినిమాల్లో నటించారు. ఇప్పుడైతే ఒక్కో సినిమా మూడేళ్లుపడుతోంది. భారతదేశ సినీ చరిత్రలో ఎన్టీఆర్‌లాగ విభిన్న పాత్రలు పోషించిన నటుడు లేరు. ప్రతి పాత్రలోనూ ఆయన జీవించారు' అంటూ ఎన్టీఆర్ పట్ల ఆరాధన వ్యక్తం చేశారు.

### రాముడైనా .. కృష్ణుడైనా ఎన్టీఆరే

'ఒక రాముడు, ఒక కృష్ణుడు, ఒక వెంకటేశ్వర స్వామి అంటే మనకు గుర్తొచ్చేది ఎన్టీఆరే. ఎన్టీఆర్ రూపంలో మనం దేవుణ్ణి చూస్తున్నాము. అందరి ఇళ్లలోనూ ఆయన ఫోటోలు ఉంటాయి. వెంకటేశ్వర స్వామి, శ్రీకృష్ణుడు పాత్రలు వేసినప్పుడు ఆయన క్రమశిక్షణగా ఉండేవారు. మాంసాహారం ముట్టేవారు కాదు. ఇంట్లో నేలపై పడుకునేవారు. ఒకవైపు శ్రీరాముడు, మరోవైపు రావణుడిగా... అలాగే ఓవైపు శ్రీకృష్ణుడిగా మరోవైపు దుర్యోధనుడిగా కూడా చేశారు కదా.... దీన్ని ఎలా సమర్థిస్తారు అని నేను ఎన్టీఆర్‌ను అడిగాను. ఏ పాత్ర గొప్పతనం దానిదేనని ఆయన చెప్పారు. పాత్రలో పరకాయ ప్రవేశం చేసేవారు. దాన వీర శూర కర్ణలో మూడు పాత్రల్లో నటించి ఆ సినిమాకు దర్శకత్వం వహించారు. నిర్మాతగా, ఎగ్జిబిటర్‌గా వ్యవహరించారు. ఆల్ ఇన్ వన్ అని నిరూపించుకున్నారు. సినిమాలో 24 ఫ్రేమ్స్ చూపిం చిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్. నేను చిన్నతనంలో లవకుశ చూశాను. ఆ సినిమా కోసం ఎడ్లబండ్లు కట్టుకుని వచ్చి చూసేవారు. పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర, శ్రీనాథ కవి సార్వభౌమ వంటి సినిమాల కోసం ఆయ న ఎంతో రీసెర్చ్ చేశారు. తోడుదొంగలు సినిమాకు రాష్ట్రపతి అవార్డు వచ్చింది' అని వివరించారు.

### సినిమాల్లోనే కాదు... రాజకీయాల్లోనూ నిజమైన హీరో

'సినిమాల్లోనే కాదు రాజకీయాల్లో నిజమైన హీరో ఎన్టీఆర్. 60ఏళ్లు కుటుంబం కోసం బతికాను. ప్రజలు నన్నుఆదరించారు. నా ఈ శేష జీవితం తెలుగు ప్రజలకు అంకితం చేయాలని చెప్పి ఆచరణలో చూపించారు. 9 నెలలు ఇల్లు, కుటుంబాన్ని వదిలేసి ప్రజల్లో తిరిగారు. ఎన్టీఆర్ పెట్టిన తెలుగుదేశం పార్టీ తెలుగుజాతి ఉన్నంతవరకూ చిరస్థాయిగా ఉంటుంది. ఆన్‌లైన్‌లో 73 లక్షలమంది పార్టీ సభ్యత్వాలు తీసుకున్నారంటే అదీ టీడీపీ సామర్థ్యం. తెలుగుజాతి ఆత్మగౌరవం, పౌరుషం అంటే గుర్తొచ్చేది ఎన్టీఆరే. మహిళలకు మొదటిసారి ఆస్తిహక్కు ఇచ్చింది ఎన్టీఆరే. తల్లిదండ్రుల నుంచి ఆస్తి న్యాయపరంగా రాకుంటే న్యాయపోరాటం చేసే హక్కు ఆడపిల్లలకు ఉంది. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాకముందు సంక్షేమం లేదు. ప్రభుత్వం అంటే పెత్తందారీగా ఉండేది. కూడు, గూడు, గుడ్డ నినాదం అమలు చేశారు. రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లకు నాంది పలికింది ఎన్టీఆర్. మండల వ్యవస్థ తీసుకొచ్చి పాలనా వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికల కు శ్రీకారం చుట్టారు. కేజీ రూ.2 బియ్యం ఆయన తెచ్చిందే. ఆగస్టు సంక్షోభంలో ఆనాడు ఎన్టీఆర్‌ను దించేస్తే వెంకయ్యనాయుడు సహా ఎందరో 30 రోజులు రోడ్లపైకి వచ్చి ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేశారు. ఆనాడు ఎన్నో పార్టీలను వెంకయ్యనాయుడు కూడగట్టారు. మా అందరి కంటే వెంకయ్యనాయుడుని ఎన్టీఆర్ అభిమానించేవారు. జాతీయభావాలతో ప్రాంతీయ పార్టీలను నడిపిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్. రాయలసీమలో కరువు వచ్చినా దివి సీమలో విపత్తు వచ్చినా అగ్రనటుడు అయ్యుండీ జోలి పట్టాడు. సమాజమే దేవాలయం -ప్రజలే దేవుళ్లని చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్. నాకు ఇజాలు తెలీదు... హ్యూమనిజమే నా సిద్ధాంతం అని చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్. ఇప్పుడు అన్ని ఇజాలూ పోయాయి. మెరుగైన జీవన ప్రమాణాలు కావాలి. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నాము. అమెరికాలో తెలుగును ఒక అధికార భాషగా ప్రకటించారంటే అదీ మన సత్తా' అని చంద్రబాబు పేర్కొన్నారు.

### స్వర్ణాంధ్ర-విజన్ 2047


ఎన్టీఆర్ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర -2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించాం. హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ మన నినాదం. 10 సూత్రాలు రూపొం దించాం. పేదరికం లేని సమాజం సాధిస్తాము. ఇవాళ నేను మెగా కృష్ణారెడ్డి కట్టించిన దోకిపర్రులోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లాను. మీ మండలంలో 14,821 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయి. 51,571మంది జనాభా ఉన్నారు. ఇక్కడ జీరో పావర్టీ బాధ్యత మీరు తీసుకోవాలనని కృష్ణారెడ్డికి చెప్పాను. ప్రతికుటుంబం ఆనందంగా ఉండాలి.సంపద ఒక్కరికే పరిమితం కాకూడదు. కొందరు పేదరికంలో ఉంటే కొందరు సంపదతో తులతూగుతున్నారు. ఆర్థిక సం స్కరణల ద్వారా పబ్లిక్ ప్రైవేటుపార్టనర్ షిప్ వచ్చింది. కంపెనీలకు యూజర్ చార్జీలుకడుతున్నారు. పేదలకు అందరం చేయూతనివ్వాలి. ధనవంతులు కిందివారికి ఆసరా ఇవ్వాలి. సమాజం మనకు గౌరవం ఇచ్చింది. తిరిగి సమాజానికి ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రజలు, ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో పేదరి కాన్ని తరిమేయాలి. ఆర్థిక అసమానతలు తగ్గించేం దుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. రాళ్లు, రప్ప లున్న హైదరాబాద్‌ను సింగపూర్, న్యూ యార్క్‌గా మార్చానని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు.

### 2047నాటికి ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా భారత్

2047నాటికి భారతీయులు ప్రపంచంలో ఎక్కడున్న నెంబర్ వన్‌గా ఉంటారు. ఆయా దేశాల్లో పరపతి ఉందంటే మనవాళ్లకే సాధ్యం. భారతీయుల్లో అగ్రస్థానంలో తెలుగుజాతి ఉంటుంది. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యసాధన కోసం మనందరం పనిచేయాలి. మన తలసరి ఆదాయం 3,200 డాలర్లు ఉంది. అదే అమెరికాలో మన తెలుగువాడు రూ.లక్షా 20 వేల డాలర్లు సంపాదిస్తున్నాడు. అదే అమెరికన్ ఆదాయం కేవలం రూ.60 వేల డాలర్లే . ఇక్కడితో పోల్చితే వారు 40 రెట్లు ఎక్కువ ఉన్నారు.రాబోయే 14 ఏళ్లలో 42 వేల డాలర్లుగా మన తలసరి ఆదాయం ఉండా లని నా కోరిక. ఎన్టీఆర్ స్ఫూర్తితో పేదరిక నిర్మూలన తోపాటు ఆర్థిక అసమానతలు కూడా తగ్గించే బాధ్యత నేను తీసుకుంటాను. నిరంతరం కష్టపడే తత్వం, త్యాగనిరతి ఎన్టీఆర్‌ది. 60ఏళ్ల తర్వాత రాజకీయాల్లో వచ్చి రాక్షసుడిలా కష్టపడ్డారు. తెలుగుజాతి కోసం త్యాగంచేశాడు.ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వడం దేశాన్ని గౌరవించడమే. ఆయనకు భారతరత్న సాధించితీరు తాం. ఎన్టీఆర్ బాటలో పయనిద్దాం. ప్రపంచంలోనే తెలుగుజాతిని నెంబర్ వన్‌గా చేసే బాధ్యత నాది. భారతదేశ అభివృద్ధిలో మన తెలుగుజాతి భాగస్వామి కావాలి. స్వర్ణాంధ్ర మన కల. ఎన్టీఆర్ వారసులమని గర్వంగా చెప్పుకునే రోజు దగ్గరలోనే ఉంది. కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టీడీ జనార్దన్, బృందాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు అన్నారు.

# సభ్యత్వ నమోదులో
# టీడీపీ సరికొత్త రికార్డ్

- 50 రోజుల్లో 73 లక్షల మంది నమోదు... కొత్తగా 54 శాతం మంది
- టాప్ 5లో రాజంపేట, నెల్లూరు సిటీ, కుప్పం, పాలకొల్లు, మంగళగిరి
- క్యాడర్, నాయకులకు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు అభినందనలు
- పార్టీ, ప్రజల కోసం కష్టపడి పనిచేసిన వారికి పదవులు కల్పిస్తాం
- సంక్షేమం అందించడంతో పాటు ఆర్థికంగా ఎదిగేలా కార్యక్రమాలు
- మంత్రులకు పెండింగ్ బిల్లుల పరిష్కార బాధ్యత అప్పగిస్తూ నిర్ణయం




మంగళగిరి(చైతన్యరథం): సభ్యత్వ నమోదులో తెలుగుదేశం పార్టీ సరికొత్త రికార్డు సృష్టించింది.. అక్టోబర్ 26న సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కాగా శనివారం నాటికి 73 లక్షలకు చేరిందని పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు తెలిపారు. సభ్యత్వ కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యత్వ నమోదుతో బలమైన కార్యకర్తల ఆర్మీని తయారు చేస్తా మని చెప్పారు. సభ్యత్వ నమోదుపై పార్టీ కేంద్ర కార్యాలయంలో నాయకులతో చంద్రబాబు శనివారం సమీక్షించారు. ముందుగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నేతృత్వంలో సభ్యత్వ కార్యక్రమం జరుగుతుందన్న ఆ విభాగ ప్రతినిధులు సభ్యత్వ నమోదు అంశాలను వివరించారు. నేటికీ దాదాపు 73 లక్షల మంది సభ్యత్వం తీసుకోగా ఇందులో 85 వేల మంది తెలంగాణ రాష్ట్రం నుంచి పొందినట్లు చెప్పారు. ఇప్పటివరకు జరిగిన నమోదులో 54 శాతం మంది కొత్త వారు సభ్యత్వం తీసుకున్నట్లు వివరించారు. సభ్యత్వ నమోదులో 1.18 లక్షలతో రాజంపేట మొదటిస్థానంలో ఉందగా, నెల్లూరు సిటీలో 1.06 లక్షలు, కుప్పంలో 1.04 లకలు, పాలకొల్లులో 1.02 లక్షలు, మంగళగిరిలో 90 వేల సభ్యత్వాలు నమోదయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రతి నలుగురిలో ఒకరు తెలుగుదేశం సభ్యత్వం పొందే పరిస్థితి రావాలని సూచించారు. తెలుగుదేశం కార్యకర్తలకు సంక్షేమం అందించడంతో పాటు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్, అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ పథకాలు ప్రాధాన్యతా క్రమంలో అందించడం ద్వారా ఆర్థికంగా వాళ్లు నిలదొక్కుకునే కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని చెప్పారు. కేవలం సంక్షేమం మాత్రమే కాకుండా కార్యకర్తల తలసరి ఆదాయం పెంపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. కష్టపడి పనిచేసిన వారికి మెరిట్ పద్ధతిలో పదవులు ఇవ్వడంతో పాటు ఆయా కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టే కార్యక్రమం పార్టీలో అన్నిస్థాయిల లో జరుగుతుందని చెప్పారు. అనంతరం పార్టీకి చెందిన ఇతర విభాగాల పనితీరుపైనా సమీక్షించారు.

### ముగ్గురు మంత్రులకు పెండింగ్ బిల్లుల పరిష్కార బాధ్యత

గత వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నీరు చెట్టు, నరేగా బిల్లులను నిలిపివేయగా తాము కొంత మేర బిల్లులు ఇచ్చామని.. మిగిలిన మొత్తం కూడా త్వరలో చెల్లిస్తామని చంద్రబాబు చెప్పారు. నాడు పనులు చేసి బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నవారి సమస్యల పరిష్కారబాధ్యతను ముగ్గురు మంత్రులకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు,పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు ఈఅంశంపై ఎప్పటికప్పుడు చర్చించి ప్రభుత్వం నుంచి నిబంధనల ప్రకారం బిల్లులు మంజూరు అయ్యేలా చూసే బాధ్యతను అప్పగించారు.

# డోకిపర్రు వెంకటేశ్వరుడిని దర్శించుకున్న చంద్రబాబు

- పీ4 విధానంలో భాగస్వామ్యం కావాలని కృష్ణారెడ్డికి సూచన
- బీపీఎల్ కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు అంగీకారం

గుడ్లవల్లేరు(చైతన్యరథం): కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు మహాక్షేత్రంలోని భూసమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు వ్యవస్థాపక ధర్మకర్తలు పి.వి.కృష్ణారెడ్డి దంపతులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేద పండితులు సీఎం చంద్రబాబును ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయం నిర్మాణాన్ని పరిశీలించిన చంద్రబాబు అనంతరం మీడియాతో మాట్లాడారు. వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కృష్ణారెడ్డి దంపతులు బాగా అభివృద్ధి చేశారు..స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లో పేదరిక నిర్మూలనకు గురించి ప్రస్తావించాం..2047 నాటికి ప్రపంచంలో భారతదేశం, దేశంలో ఏపీ అగ్రభాగాన ఉంటాయి..పీ4 విధానంలో భాగంగా గుడ్లవల్లేరు మండలంలోని బీపీఎల్ కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు చొరవ తీసుకోవాలని కృష్ణారెడ్డికి సూచించగా ఆయన అంగీకరించారు. ప్రతి జిల్లా, ప్రతి మండలం, ప్రతి గ్రామంలోని పేదలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు పారి శ్రామిక వేత్తలు తోడ్పాటునందించాలని సీఎం పిలుపునిచ్చారు. జమిలి విధానంలో భాగంగా దేశంలో ఎన్నికలన్నీ ఒకసారి జరిగితే అభివృద్ధి చేసుకోవడానికి ఎక్కువ సమయం ఉంటుంది. మూడు నెలలకు ఒకసారి దేశంలో ఎన్నికలు జరుగుతూ ఉంటే పాలకులు ఎన్నికల కోసమే పనిచేయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు.







చైతన్యరథం

# ఎన్టీఆర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన



విజయవాడ (చైతన్య రథం): క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి పనిచేయడం వంటివి ఎన్టీఆర్‌నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అంశాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు.విజయవాడలోని పోరంకిలో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. వజ్రోత్సవాల్లో భాగంగా 'తారకరామం- అన్నగారి అంతరంగం', 'ఎన్టీఆర్ సినీ ప్రస్థానం' పుస్తకాలను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్సైట్ కమిటీ ఈ పుస్తకాలను ముద్రించింది. వెంకయ్యనాయుడు మాటాడుతూ.. ఎన్టీఆర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన నటించిన ప్రతి సినిమా ఓ సందేశాత్మకమని లోతుగా చూసిన వాళ్లకే అర్థమవుతుందన్నారు. నేటితరం తెలుసుకోవాల్సిన అంశాలు 'ఎన్టీఆర్ అంతరంగం' పుస్తకంలో ఉన్నాయన్నారు.ఎన్నో సందేశాలను సినిమా ద్వారా వివరించింది ఎన్టీఆర్ మాత్రమేనని కొనియాడారు. స్వర విన్యాసం, నటవిశ్వరూపంలో ఆయనకు ఆయనేసాటి అని పేర్కొన్నారు. తెలుగు భాషా మాధుర్యాన్ని ఎన్టీఆర్ ప్రపంచానికి చాటారని వెంకయ్యనాయుడు కొనియాడారు.

# ఎన్టీఆర్ ఏంచెప్పారంటే..!!

- వజ్రోత్సవాల్లో 'ముచ్చట్లు' ఆవిష్కరించిన చంద్రబాబు, వెంకయ్య
- తారకరామం పేరిట సినీ జీవిత విశేషాల పుస్తకం



అమరావతి, (చైతన్యరథం): నటరత్న ఎన్టీఆర్ తొలి సినిమా మనదేశం 1949లో విడుదలై ఇప్పటికి 75 సంవత్సరాలైన సందర్భంగా ఆయన సినీ వజ్రోత్సవాలను అభిమానులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'తారకరామం- అన్నగారి అంతరంగం' శీర్షికతో ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ ఒక పుస్తకాన్ని ప్రచురించింది. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలను విజయవాడలోని పోరంకిలో శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వజ్రోత్సవాల్లో ఆ పుస్తకంతోపాటు రూపొందించిన ఎన్టీఆర్ సినీ ప్రస్థానం పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. తెదేపా రాజకీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ చైర్మన్‌గా ఉన్న 'ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ ఈ వేడుకల్ని నిర్వహించింది. కార్యక్రమంలో సినీనటి జయప్రద, నిర్మాతలు డి సురేష్ బాబు, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, నందమూరి రామకృష్ణ, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు.

### ఎన్టీఆర్ సినీ జీవిత విశేషాల సమాహారం..


ఎన్టీఆర్ సినీ జీవిత ప్రస్థానంలోని వివిధ ఘట్టాలు, పార్శ్వాలకు సంబంధించి వివిధ సందర్భాల్లో, ఇంటర్వ్యూల్లో ఆయనే చెప్పిన విశేషాలతో పాటు, ఆయన వ్యక్తిత్వం, నటనా వైదుష్యం, క్రమశిక్షణ, అకుంఠిత దీక్ష, నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా విభిన్నపాత్రల్ని సమర్థవంతంగా నిర్వహించిన తీరును 'తారకరామం' పుస్తకంలో పొందుపర్చారు. ఆయనతో పనిచేసిన ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, నటులు, సాంకేతిక నిపుణులు, పాత్రికేయులు, రచయితలు వెల్లడించిన అనుభవాల సమాహారంగా తీర్చిదిద్దారు. బీఏ సుబ్బారావు, అట్లూరి పుండరీకాక్షయ్య, కృష్ణకుమారి, సి.నారాయణ రెడ్డి, పేకేటి శివరాం, తాతినేని ప్రకాశరావు, ఎంజీ రామచంద్రన్, పీతాంబరం, రామలక్ష్మీ అరుద్ర, డీవీఎస్ రాజు, బీఎన్ రెడ్డి, కొంపెల్ల విశ్వం, గుడిపూడి శ్రీహరి, సత్తెనపల్లి రామమోహనరావు, బాపు-రమణ, బీ మోహన్, గోటేటి వినాయకరావు వంటివారు... ఎన్టీఆర్ గురించి చెప్పిన విశేషాల్ని గుదిగుచ్చి... అందమైన పుష్పగుచ్ఛంలా తీర్చిదిద్దారు. "పాతాళభైరవి సినిమాతో ఎన్టీఆర్‌కు స్టార్ స్టేటస్ సంపాదించి పెట్టిన దర్శకుడు కేవీ రెడ్డి, 'మాయాబజార్' సినిమాతో ఆయనను దైవాంశ సంభూతుడిగా నిలబెట్టారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ శ్రీకృష్ణుడి పాత్ర పోషించారు. ఆ పాత్రకు ప్రేక్షకులు నీరాజనాలు అర్పించారు. ఎన్టీఆర్‌లో దైవాన్ని చూడడం మొదలు పెట్టారు. తిరుపతి వెళ్లి వేంకటేశ్వరసామిని దర్శించుకున్న భక్తులు తప్పనిసరిగా మద్రాసు వెళ్లి ఎన్టీ రామారావు దర్శనం కోసం ఆయన నివాసం ముందు గంటల తరబడి నిరీక్షించేవారు" అని ఒక సీనియర్ పాత్రికేయుడు వివరించారు. ఎన్టీఆర్ గురించి ప్రస్తుత తరానికి తెలియని ఇలాంటి ఎన్నో విశేషాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

"ఒక నిర్మాత, ఒక దర్శకుడు, ఎందరో సాంకేతిక నిపుణులు, కళాకారులు సమష్టిగా తయారు చేసిన ఒక చిత్రాన్ని అది ఎంత ప్రజాదరణ పొందినా 'నాది' అని చెప్పుకోలేను. అందువల్లే దర్శకత్వానికి ఉపక్రమించాను. ఏ చిత్రానికైనా సృష్టికర్త దర్శకుడే కదా. దర్శకత్వంలో నాకు గురువు అంటూ ఎవరూ లేరు. ఏ ఒక్కరి పద్ధతీ నేను అనుసరించను. నాదంటూ సొంతమైన ఒక పద్ధతి రూపొందించుకున్నాను"... తాను దర్శకుడిగా ఎందుకు మారాల్సి వచ్చిందీ వివరిస్తూ ఎన్టీఆర్ చెప్పిన మాటలు ఇవి. ఆయన అంతరంగాన్ని వెల్లడించే ఇలాంటి విశేషాలెన్నో ఈ పుస్తకంలో ఉన్నాయి. నాటి తెలుగు సినిమా పరిశ్రమలో తన సమకాలికులైన మేటి దర్శక, నిర్మాతల నుంచి తాను నేర్చుకున్న వృత్తిగతమైన, వ్యక్తిగతమైన జీవితానుభవాల సారాన్ని ఆయన మాటల్లోనే ఈ పుస్తకం కళ్లముందు సాక్షాత్కరిస్తుంది.

కాలేజీ రోజుల్లో నాటకాలు వేసేటప్పుడు ఆడవేషం వేయమంటే ఎక్కడలేని పౌరుషం వచ్చేది. వేడి, వాడి గల పాత్రలు నాకు చాలా ఇష్టం. బెజవాడ కాలేజీలో మా మాస్టారు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ నా చేత ఆడవేషం వేయించాలని పట్టుపట్టడం- అదో గమ్మత్తు కథ. రాచమల్లుని దౌత్యంలో నాగమ్మపాత్ర నాకు ఇచ్చారు. పౌరుషానికి కావాలంటే మీసం తీయకుండానే ఆ పాత్ర ధరిస్తానని భీష్మించాను. అలా భీష్మించే అలవాటు అప్పటికీ, ఇప్పటికీ నాలో ఉంది."

- 1961లో ఆంధ్ర సచిత్ర వారపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్టీ రామారావు చెప్పిన విశేషం ఇది.

ఎన్టీఆర్‌కు విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు అన్న బిరుదును అప్పటి కంచి పీఠాధిపతి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి ప్రసాదించారని చెబుతారు. సీతారామ కల్యాణం సినిమాలో ఎన్టీఆర్ అద్భుతంగా నటించారని తెలుసుకుని, ఆయన ఆ సినిమా చూశాక ఆ బిరుదు ప్రదానం చేశారని చెబుతారు."



### ఎన్టీఆర్‌పై రాసిన వ్యాసంలో ఒక పాత్రికేయుడు వెల్లడించిన విశేషం ఇది..

ఆయన కార్యశూరుడు, తలపెట్టిన ఏ పనైనా అనుకున్న సమయానికి జరగాల్సిందే. సినిమా షూటింగ్ సమయంలో ఆ పాత్ర ధ్యాస తప్పితే, ఇతర వ్యాపకం ఉండదు. అనవసరంగా మాట్లాడుతూ కూర్చోరని, సెట్లో పని చకచకా జరుగుతుందని, అందరూ ఏకాగ్రతతో ఉంటారని కొందరు నిర్మాతలు, దర్శకులు అనడం స్వయంగా విన్నాను. ఆయన వల్ల షూటింగ్ రద్దయిందనో, ఆయన కోసం నిరీక్షిస్తున్నామనో ఎవరూ ఎప్పుడూ అనలేదు."

1962లో సినిమారంగం పత్రికలో ఎన్టీఆర్ గురించి ప్రముఖ నటుడు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ చేసిన వ్యాఖ్యలు ఇవి.

### గత పుస్తకాలకు భిన్నంగా..

ఎన్టీఆర్ జీవితంపై ఇప్పటి వరకు పలు కోణాల్లో పుస్తకాలు వచ్చినా... నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా పలు సందర్భాల్లో, పలు అంశాలపై ఎన్టీఆర్ వ్యక్తం చేసిన ఆయన మనసులోని భావాలకు ఎవరూ స్పృశించని విధంగా ఈ పుస్తకంలో అక్షర రూపం ఇచ్చారు. కేవలం సినిమా విశేషాలే కాకుండా... ఎన్టీఆర్ జీవిత ప్రస్థానం, కుటుంబ నేపథ్యం గురించిన విశేషాల్ని కూడా పొందుపరిచారు. 1949లో 'మనదేశం' చిత్రంతో ప్రారంభించి... 1993లో 'శ్రీనాథ కవిసార్వభౌమ' వరకు 303 చిత్రాల్లో వైవిధ్యభరితమైన, స్ఫూర్తిమంతమైన పాత్రలకు ఆయన జీవం పోసిన తీరును కళ్లకు కట్టారు. సినీపరిశ్రమ హైదరాబాద్‌లో నిలదొక్కుకోవడానికి ఎన్టీఆర్ చేసిన ఆలోచనలు, తీసుకున్న నిర్ణయాలు, ఆ క్రమంలో ఎదురైన అనుభవాలు, విమర్శలు... ఈ మొత్తం ప్రయాణంలో ఆయన అనుభవించిన మానసిక సంఘర్షణకు అక్షరరూపంలో ఇచ్చారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఆయన తెలుగు సినిమా పరిశ్రమకు అందించిన చేయూత, ప్రోత్సాహకాల వివరాలు పొందుపరిచారు. 'తారకరాముని అపురూప చిత్రాలు' శీర్షికతో ఆయన బాల్యం నుంచి.. ఉమ్మడి రాష్ట్రానికి తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే వరకు ఆయన సినీ, రాజకీయ జీవితంలో అనేక మంది ప్రముఖులతో ఉన్న అరుదైన చిత్రాల్ని పొందుపరిచారు. ఎన్టీఆర్ నటించిన, దర్శకత్వం వహించిన, నిర్మించిన సినిమాల జాబితాలతో పాటు... ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేసిన చిత్రాలు, జానపద చిత్రాలు, 100 రోజులు, 175 రోజులు ప్రదర్శించిన చిత్రాలు, స్వర్ణోత్సవ, వజ్రోత్సవ చిత్రాలు... ఇలా విడివిడిగా జాబితాలుగా ఇచ్చారు.







# నటసార్వభౌముడు ప్రాత:స్మరణీయుడు











# కుమార్తెను చంపిన నేరస్తులకు అండగా పోలీసులు



- న్యాయం కోసం స్టేషన్‌కు వెళితే మాపైనే అక్రమ కేసులు
- విడదల రజనీ, లేళ్ల అప్పిరెడ్డి దగ్గర పనిచేసే వారే కారకులు
- వైసీపీ నేతల అనుచరులమని చెప్పుకుంటూ బెదిరిస్తున్నారు
- ప్రజావినతుల కార్యక్రమంలో చంద్రబాబుకు ఓ తల్లి గోడు
- ఎంతటి వారున్నా వదిలేది లేదు.. న్యాయం చేస్తామని సీఎం హామీ
- తానేటి వనిత అండతో భూమి కబ్జా చేశారని మరో ఫిర్యాదు
- పొలంలోకి పోనివ్వకుండా వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని ఆవేదన

మంగళగిరి(చైతన్యరథం): మానవ మృగాలకు కొమ్ముకాసి.. నేరస్తులకు రక్షణ కల్పించిన గత వైసీపీ ప్రభుత్వంలో దుర్మార్గపు చర్యలు అనేకం బయటపడు తున్నాయి. న్యాయం చేయాలని అడిగిన బాధితులనే హింసిస్తూ గత ప్రభుత్వంలో పోలీసులు కేసులు పెట్టి వేధించిన ఘటనలూ వెలుగుచూస్తున్నాయి. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తన కుమార్తె హత్య కేసులో న్యాయం చేయాలని ఓ మహిళ, పొలంలోకి దిగితే వైసీపీ నేతలు చంపేస్తామని బెదిరి స్తున్నారని ఓ బాధితుడు, గత ప్రభుత్వంలో అకా రణంగా పింఛన్లు తొలగించారని విభిన్న ప్రతిభావంతు లు ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యం, ఇతర సమస్య లతో బాధపడే వారికి సీఎం ఆర్థికసాయం చేశారు.

### చిత్రహింసలు పెట్టి నా కుమార్తెను చంపేశారు

డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న తన కుమార్తె 2022జూలై 4న కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు.. అదే కాలనీలో ఉంటున్న ఆటోడ్రైవర్ ఆనంద్ అనే యువకుడు ప్రేమ పేరుతో వంచించి తీసుకెళ్లాడు... 14 నెలల పాటు తన కుమార్తెను చిత్రహింసలు పెట్టి బండారు ఆనంద్, అతని సోదరులు అరవింద్, అజిత్ వారి మేనమామ తిరుపతిరావు, అత్త అంకలక్ష్మి తన కుమార్తెను శవంగా పంపించారని గుంటూరు జిల్లా గుజ్జనగుళ్లకు చెందిన నిశ్శంకర శంకరలీల అనే మహిళ సీఎం ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. తన కుమార్తె హత్యపై రెండేళ్లుగా పోరాడుతుంటే మాపైనే హత్యాయత్నం కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆ కేసులో రెండేళ్లుగా తిరుగుతున్నామని.. వైసీపీ నేతలు విడదల రజనీ, లేళ్ల అప్పిరెడ్డి దగ్గర పనిచేస్తామని చెబుతూ బెదిరించారన్నారు. చేతికి అంది వచ్చిన కుమార్తెను పోగొట్టుకున్నదే కాక అక్రమంగా పెట్టిన కేసులో ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నా మని మొరపెట్టుకున్నారు. న్యాయం చేయాలని నాటి నల్లపాడు సీఐని కోరగా అసభ్య పదజాలంతో దూషించారని వివరిం చింది.తన కుమార్తెను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితురాలు వేడుకున్నారు. శంకర లీల బాధను విన్న సీఎం ఆమెను ఓదార్చారు.కేసులో ఎంతటివాళ్లున్నా వదిలిపెట్టమని తప్పకుండాన్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

### వైసీపీ నేతలు చంపేస్తామని బెదిరిస్తున్నారు

పొలంలోకి అడుగుపెడితే చంపేస్తామని వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని రాజమండ్రి రూరల్ మండలం హుకుంపేటకు చెందిన బొప్పన సురేష్‌బాబు సీఎంకు ఫిర్యాదు చేశారు. 2021లో చాగల్లు పరిధిలోని దారవరం, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెంలో 17 ఎకరాలు పొలం కొనుగోలు చేశాం..7.57 రిజిస్ట్రేషన్ కాగా మిగతాది అగ్రిమెంట్ రాయిం చుకున్నాం..కానీ వైసీపీ నేతలు ఆ పొలంలోకి రానివ్వకుండా అడుగుపెడితే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ హోంమంత్రి తానేటి వనిత ప్రోద్బలంతో కేసులు పెట్టి వేధించారు..నా పొలం నాకు దక్కేలా న్యాయం చేయాలని విన్నవించారు.

### సీఎం ఎదుట జవాన్ దంపతుల కంటతడి

జగన్ ప్రభుత్వంలో తాము తీవ్ర ఇబ్బందులు పడ్డామని విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన అక్కల రోజా, ఆమె భర్త జవాన్ జ్ఞానానంద్ సీఎం చంద్రబాబు దగ్గర కంటతడి పెట్టుకున్నారు. బిల్డింగ్ 3వ అంతస్తుకు అనుమతి ఇవ్వకుండా ఐదేళ్ల పాటు తిప్పి ఇబ్బందులకు గురి చేశారని జవాన్ దంపతులు మొరపెట్టుకున్నారు. కృష్ణ అనే వ్యక్తి ఇల్లు కొనుగోలు చేసి రూ.10 లక్షల మేర ఇవ్వకుండా బెదిరించదంతో అప్పులపాలై రోడ్డునపడ్డామని వివరించారు. సమస్యను పరిష్కరిస్తామని వారికి సీఎం హామీ ఇచ్చారు.


















చైతన్యరథం

# పునరుత్పాదక విద్యుత్‌రంగంలో పెట్టుబడులను స్వాగతిస్తున్నాం

## సీఎంను కలిసిన ఎస్‌ఏఈఎల్ ప్రతినిధులు - రాష్ట్రంలో పెట్టుబడులపై ఇరువర్గాల చర్చ


అమరావతి (చైతన్యరథం): ఎస్‌ఏఈఎల్, నార్ఫండ్, ఎస్డీబీ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో భేటీ అయ్యారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులను స్వాగతిస్తున్నామన్నారు. చెత్తనుంచి విద్యుదుత్పత్తికి ఎస్‌ఏఈఎల్ అనుసరిస్తోన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించిందన్నారు. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి రైతుల ఆదాయాన్ని పెంచే ఈ తరహా ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడానికి పూర్తి సహకారం అందించే దిశగా తమ చర్చలు సాగాయని సీఎం అన్నారు. ఏపీలో ఎస్‌ఏఈఎల్ రెండుదశల్లో 1200మెగా వాట్ల విద్యుదుత్పత్తికి పెట్టుబడులు పెట్టనుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న అన్ని అనువైన పరిస్థితులపై ప్రతినిధులతో చర్చించామన్నారు.





# వైసీపీకి విశ్వసనీయత లేదు

- ఆ పార్టీ నాటకాలు చూసి ప్రజలు నవ్వుతున్నారు
- విజన్ డాక్యుమెంట్‌పై విస్తృతమైన చర్చ జరగాలి
- రేపటి భవిష్యత్ కోసం సిద్ధం చేసిన డాక్యుమెంట్ అది
- విజన్ -2020 సాకారాన్నీ నేటితరం తెలుసుకోవాలి
- 'జమిలి' అమల్లోకి వచ్చినా.. ఎన్నికలు '29లోనే
- వచ్చే కలెక్టర్ల సదస్సులో మార్పులు తెస్తున్నాం...
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): జమిలి అమల్లోకి వచ్చినా.. ఎన్నికలు జరిగేది 2029లోనే అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. మీడియాతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "ఒకే దేశం, ఒకే ఎన్నిక" విధానానికి ఇప్పటికే మా మద్దతు ప్రకటించాం. వైకాపా పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతోంది. ఆ పార్టీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారు. వైకాపా చేసే నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర విజన్ -2047 డాక్యుమెంటును ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలి. వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలతో పాటు ప్రతి చోటా చర్చ జరగాలి. విజన్ 2020 సాకారమైన తీరు నేటితరం తెలుసుకోవాలి. గత పరిస్థితులను బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు అందరికీ కనిపిస్తున్నాయి. 2047లోనూ ఇదే పునరావృతం అవుతుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఒకరోజు పెట్టి వదిలేసేది కాదు. భవిష్యత్తు తరాల బాగుకోసం చేసే ప్రయత్నంలో అందరి భాగస్వామ్యం కావాలి. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047. సాగునీటి సంఘాలు, సహకార, ఇతరత్రా ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయి అన్నారు.

ఈసారి కలెక్టర్ల సదస్సులో ఎన్నో మార్పులు తీసుకొస్తాం. సుదీర్ఘ సమీక్షలకు తావివ్వకుండా ప్రశ్నలు-సమాధానాల రూపంలో నిర్వహిస్తాం. ముందుగానే కలెక్టర్లు, ఎస్పీలకు చర్చ అంశాలు పంపి సమాధానాలు కోరతాం. దీంతో సమయం సద్వినియోగం కావడంతో పాటు మంత్రులు- అధికారుల మధ్య సమన్వయం పెరుగుతుంది. ఆసుపత్రిలో చేరిన భాజపా అగ్రనేత ఎల్‌కె అద్వానీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. అద్వానీతో నాకు దశాబ్దాలుగా అనుబంధముంది. ఆనాడు ఏపీ అభివృద్ధిలో ఆయన సహకారం మరువలేనిది" అని చంద్రబాబు తెలిపారు.

### ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవంలో
## ఆకర్షణగా బాలు ఆర్టిస్ట్ చిత్ర ప్రదర్శన



విజయవాడ(చైతన్యరథం): ఎన్టీఆర్ సినీరంగంలోకి ప్రవేశించి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ సమీపంలోని పోరంకి మురళి రిసార్ట్స్‌లో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం వైభవంగా జరిగింది. బాలు ఆర్టిస్ట్ రూపొందించిన ప్రత్యేక చిత్ర ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఎన్టీఆర్ అపూర్వ సినీ ప్రయాణాన్ని తన చిత్ర కళలో మలచి ప్రత్యేకంగా ప్రజల ముందుకు తీసుకొచ్చారు. మహాభారతం, రామాయణం వంటి శాశ్వత కథల్లో ఎన్టీఆర్ నటించిన పాత్రలను ప్రతిబింబించే చిత్రాలు, పంచభూతాలకు సంబంధించిన కళాఖండాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ చిత్రాల్లో ప్రతి స్ట్రోక్ ఎన్టీఆర్ చారిత్రక పాత్రలను నెమరువేసేలా అద్భుతంగా ఉండటంతో ప్రదర్శనను సందర్శించిన వారు చిత్రాలను పొగడకుండా ఉండలేకపోయారు. ఎన్టీఆర్ అభిమానులు, కళాప్రియులు భారీగా హాజరైన ఈ కార్యక్రమంలో ఆయనను స్మరించుకుంటూ సజీవంగా ఉంచే ఒక ప్రాముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. బాలు ఆర్టిస్ట్ ప్రతిభ ఈ వజ్రో త్సవ వేడుకలకు మరింత శోభను తీసుకువచ్చిందని నిర్వాహకులు పేర్కొన్నారు.



# నేడు పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం



- అధికారికంగా ప్రత్యేక కార్యక్రమాలకు సిద్ధం
- పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పార్థసారథి

ఎన్టీఆర్ జిల్లా(చైతన్యరథం): పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినోత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమాలకు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజలు హాజరుకానున్నారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా కార్యక్రమం విజయవంతంగా నిర్వహిం చేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

చైతన్యరథం

# గీత కార్మికులను మరింత ప్రోత్సహిస్తాం

- అర్హులైన గౌడలకు సంక్షేమ పథకాలు అందిస్తాం
- ప్రతి ఇంట్లో పారిశ్రామిక వేత్తలను తయారుచేస్తాం
- గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి
- విజయవాడలో పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం
- పాల్గొన్న మంత్రులు కొలుసు, అనగాని, సత్యప్రసాద్



విజయవాడ(చైతన్యరథం): గౌడ కుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందిస్తామని ఏపీ గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తెలిపారు.. బెంజి సర్కిల్‌లో కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో ఏపీ గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా వీరంకి వెంకట గురుమూర్తి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ బీసీ కులాల చేతివృత్తులకు పూర్వవైభవం తీసుకు వస్తామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గీత వృత్తిని మరింత ప్రోత్సహిస్తామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన గౌడ్ కుల కార్పొరేషన్ చైర్మన్ పదవి రాష్ట్రంలోని బీసీలకు సేవ చేసే అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పా రు. కూటమి ప్రభుత్వం బీసీలకు ఒక్క ఏడాదిలోనే రూ.39,000 కోట్ల బడ్జెట్ కేటాయించిందని వివరించారు. గౌడ కులాలు ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా కేరళలో ఉన్న నీరా ఉప ఉత్పత్తులను అక్కడ ఏ విధంగా ప్రోత్సహిస్తున్నారో ఏపీలో కూడా ఉప ఉత్పత్తులను ప్రోత్సహిస్తామన్నారు. ప్రతి ఇంట్లో పారిశ్రామిక వేత్తలను తయారుచేయాలన్నదే ముఖ్య మంత్రి చంద్రబాబు లక్ష్యమని.. గౌడ కులాల్లో కూడా పరిశ్రమలు పెట్టుకునేలా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

## గురుమూర్తికి పదవి హర్షణీయం

గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ నమ్ముకున్న వారికి పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటూ వారి పక్షాన నిలబడుతుందన్నారు. ఈ పదవి రావడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. నాకు 25 సంవత్సరాలుగా గురుమూర్తి వ్యక్తిగతంగా తెలుసునని చెప్పారు. బీసీలకు అండగా ముఖ్యమంత్రి అనేక పథకా లను అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం గౌడ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ గురుమూర్తి పార్టీ కోసం, బీసీల కోసం ఐదేళ్లలో ఎంతో కష్టపడ్డారని దాని ఫలితమే ఈ పదవి అని కొనియాడారు. ఎన్టీఆర్ బడుగుల కోసం పాటుపడితే ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తూ ముందుకునడిపిస్తున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ప్రశంసించారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ నేడు ఎంతోమంది బీసీలు ప్రముఖ స్థానంలో ఉండటానికి కారకులు స్వర్గీయ ఎన్టీఆర్ అని..పార్టీ కోసం శ్రమించిన గురుమూర్తికి కార్పొరేషన్ పదవి ఇస్తూ సముచిత స్థానం కల్పించడం హర్షణీయమన్నారు.

గత ప్రభుత్వంలో బీసీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని తెలిపారు. ముందుగా ఏపీ గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా వీరంకి వెంకట గురు మూర్తి చేత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.తనూజరాణి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, అంగర రామ్మోహన్, ఎమ్మెల్యేలు వర్ల కుమార రాజా, గద్దె రామ్మోహన్, వెనిగండ్ల రాము, నక్కా ఆనంద బాబు, బోడే ప్రసాద్, గౌతు శిరీష, కాగిత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, నిమ్మకాయల చినరాజప్ప, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు కొనకళ్ల నారాయణ, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రావి వెంకటేశ్వరరావు, లంకా దినకర్, మాజీ పార్లమెంట్ సభ్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ టి.డి.జనార్దన్, ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, నాయకులు నాగుల్ మీరా, గొట్టిపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.







# రైతును ముంచేసింది జగనే

- వైసీపీ పాలనలో అన్నదాత అధోగతి పాలు
- వ్యవసాయ శాఖనూ భ్రష్టుపట్టించారు..
- రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజం



మంగళగిరి (చైతన్యరథం): పదిమందికీ పట్టెడన్నం పెట్టే అన్నదాత మనుగడకే ఎసరుపెట్టిన జగన్‌రెడ్డికి రైతుల గురించి, వ్యవసాయరంగం గురించి మాట్లాడే హక్కులేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శని వారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం లో మీడియాతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్నదాతలను అధోగతి పాల్జేశాదన్నారు. అస్తవ్యస్త నిర్ణయాలతో అన్నదాత ఆత్మహత్యల్లో ఏపీ ని జాతీయస్థాయిలో మూడో స్థానానికి తీసుకెళ్లాద న్నారు. కౌలురైతు ఆత్మహత్యల్లోనూ తమిళనాడు తర్వాత స్థానం ఏపీదేనని మండిపడ్డారు. జనాభా ప్రాతిపదికన తీసుకుంటే ఇక్కడా ఏపీదే మొదటి స్థానమన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి సాధించిన ఘనత ఇదేనని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు. అన్నదాతల ప్రయోజనాలతో ముడిపడిన కీలకమైన వ్యవసాయ శాఖను ముంచేశాదని ధ్వజ మెత్తారు. ఇరిగేషన్ శాఖను చంపేశాదన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఒక్కసారి పులివెందులకు వెళ్లి రైతులతో మాట్లాడితే ఐదేళ్లలో వ్యవసాయ రంగా నికి చేసిన ద్రోహం బయట పడుతుందన్నారు. మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ యాంత్రీకరణ, భూసార పరీక్షలు, సూక్ష్మ పోషకాల పంపిణీ తది తర పథకాల అమలులో రెండు ప్రభుత్వాలకు తేడా అడిగితే జగన్ ఇలాకాలోని రైతులే చెబుతారన్నారు. వ్యవసాయ శాఖతోపాటు కీలకపథకాలను మూలన పెట్టేసిన జగన్ రైతుల గురించి మాట్లాడడం విడ్డూ రంగా ఉందన్నారు. కూటమి అధికారంలోకి రాక పోతే అన్నదాత పరిస్థితి అంధకారమయ్యేదన్నారు. కొన వూపిరితో ఉన్న రైతులు ఇప్పుడిప్పుడే కోలు కుంటున్నారన్నారు. తమ ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలుచేసిన 48గంటల్లో వారి ఖాతా ల్లో నగదు జమ చేస్తోందన్నారు. అదే వైసీపీ ప్రభు త్వంలో రైతు లకు ఐదారు నెలలు పడిగాపులు తప్పలేదన్నారు. జాతీయస్థాయిలో రైతుల తలసరి అప్పు రూ.74500గా ఉంటే ఏపీలోవైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.45 లక్షలకు చేరిందన్నారు. తమ హయాంలో నీటిపారుదల శాఖకు 2014-19 మధ్య రూ.64,800కోట్లు ఖర్చుపెట్టామన్నారు. పెరిగిన ధరల ప్రకారం వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.80 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉందన్నారు. కానీ రూ.30 వేలు కోట్లు మాత్రమే ఖర్చు పెట్టార న్నారు. కేటాయింపుల్లో నిధులు తగ్గించేసి, నీటి పారుదల శాఖను చంపేశారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు అందించామన్నారు. తద్వారా కృష్ణా మిగులు జలాలను కరువు పీడిత రాయల సీమకు చేర్చామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పరంగా జగన్మోహన్‌రెడ్డి సాధించిన ఘనత ఏమైనా ఉందా? అంటే అంతా శూన్యమే కనిపిస్తుందన్నారు. 2017-18, 2018-19లో బిందు తుంపర్ల సేద్యంలో ఏపీని జాతీయ స్థాయిలో అగ్రస్థానాన నిలిపామన్నారు. స్వర్ణాంధ్ర సాధనకు రూపకల్పన చేసిన పది సూత్రాల్లో నాలు గవది నీటి భద్రత, ఐదవదిగా సాగులో అధునాతన సాంకేతికత, 8వదిగా నాణ్యమైన ఉత్పత్తులుగా చేర్చామన్నారు. విజన్ 2047 ప్రణాళికలో రైతుల కు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. జగన్మో హన్‌రెడ్డి సీఎంగా ఏనాడైనా రైతుల మధ్యలోకి వచ్చారా? వ్యవసాయం గురించి ఏనాడైనా సమీక్ష చేశారా? అని ప్రశ్నించారు. చివరగా జగన్మోహన్ రెడ్డి చేసిందేమటని చూస్తే రైతులు పండించిన ధాన్యంతో సహా రేషన్ బియ్యాన్ని అక్రమంగా విదే శాలకు స్మగ్లింగ్ చేసి ఏ2తో పాటు ఆయన బంధు వులు కోట్లు సంపాదించడమేనని సోమిరెడ్డి ధ్వజమెత్తారు.

## తెలుగు భాష అంతరిస్తే.. తెలుగు జాతి అంతరిస్తుంది

### జస్టిస్ ఎన్వీ రమణ వ్యాఖ్య

కడప: తెలుగుభాష అంతరిస్తే.. తెలుగుజాతి అంతరి స్తుందని మాజీ సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో సాహితీమూర్తి జానమద్ది హను మచ్ఛాస్త్రి శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ ఎన్.వి. రమణ తాళపత్ర గ్రంథాలు,అరుదైన పుస్తకాలను పరిశీలించారు. అనంతరం తెలుగు వైభవం అంశంపై స్మారక ఉపన్యాసం చేశారు. "తెలుగుభాష ఉన్నతికి సీపీ బ్రౌన్ ఎంతో కృషి చేశారు. తెలుగుభాష అద్భుతం..అదొక సంగీత ప్రవాహం. విభజన తర్వాత తెలుగు భాషకు సంరక్షణ కరవైంది. నేతలు.. సంక్షేమ పథకాలు, ఉద్యోగాలపైనే దృష్టి పెడతారు. ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే ఉద్యోగాలు వస్తాయనే భ్రమల్లో ప్రభుత్వాలున్నాయి. ఆంగ్లంలో బోధించాలనే ఎస్ఎల్పీ సుప్రీంకోర్టులో ఉంది. పిటిషన్ వెనక్కి తీసుకోవాలని చంద్రబాబు,లోకేష్‌కు చెప్పా. తెలుగు భాష విజ్ఞాన కేంద్రా న్ని ఏర్పాటు చేయాలి. తమిళనాడు, కర్ణాటక నేతలు భాష కోసం ప్రాణం పెడతారు. తెలుగువారంతా మాతృభాష లోనే మాట్లాడాలి" అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు.



## నీటి సంఘాల ఎన్నికల్లో శ్రీకాకుళం విజయదుందిబి

● పోటీ చేసిన అన్నిస్థానాల్లో జయకేతనం... టీడీపీ నేతల హర్షం



శ్రీకాకుళం (చైతన్యరథం): నీటి సంఘాల ఎన్నికల్లో శ్రీకాకుళంలో విజయదుందిబి మోగించడం అభినందనీయమని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు కలమట వెంకటరమణ మూర్తి హర్షం వ్యక్తం చేశారు. శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ జరిగిన ప్రతిచోట తెలుగుదేశం పార్టీ నాయకులే గెలుపొందటం చాలా ఆనందదాయాకమైన విషయమన్నారు. ఈ గెలుపునకు సహకరించిన ఎమ్మెల్యేలకు, నాయకులుకు, కార్యకర్తలకు మరియు రైతు సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నిక కాబడిన నీటి సంఘా అధ్యక్షుల సభ్యులకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. తన స్వగ్రామంలో జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో కలమట వెంకటరమణ స్వయంగా పాల్గొన్నారు.

## నీటి సంఘాల ఎన్నికల్లో శ్రీకాకుళం విజయదుందిబి

పరవాడ (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా పరవాడ మండలం భరణికం పెద్ద చెరువు సాగునీటి సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. సాగునీటి సంఘం అధ్యక్షులుగా బోండా గోవింద్, ఉపాధ్యక్షులుగా పెదిశెట్టి వెంకట సత్యారావు ఎన్నికయ్యారు. సభ్యులుగా చెరువూరి బైరాగిరాజు, పైల కృష్ణారావు, బోండా చిన్నారావు, ప్రగడ అప్పారావు ఎన్నికయ్యారు. వీరిని కూటమి నాయకులు అభినందించారు. ఎన్నికల నిర్వహణ అధికారులుగా శంకర్, పవన్, యశోద రామలక్ష్మి, భాస్కర్ వ్యవహరించారు. ఊర చెరువు సాగునీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. సాగునీటి సంఘం అధ్యక్షులుగా సిరిపురపు సింహాచలం, ఉపాధ్యక్షులుగా దెక్క చెల్లారావు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా పైల అప్పారావు, పైల జగదీష్, చుక్క గోపి, చిలుక అప్పలనాయుడు ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

## చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం : గొండు శంకర్



శ్రీకాకుళం (చైతన్యరథం): చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సీఎంపై నమ్మకంతోనే ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన తెలిపారు. శ్రీకాకుళం నగరం విశాఖ 'ఎ' కాలనీలోని కార్యాలయంలో పెద్ద సంఖ్యలో కల్లేపల్లి గ్రామ నాయకులు, ప్రజలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి శంకర్ కండువాలు వేసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అదే సమయంలో సంక్షేమ పథకాలను అన్ని వర్గాలకు అందిస్తూ అండగా ఉంటున్నారన్నారు. గత వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని నేడు అభివృద్ధికి బాటలు పడుతున్నాయని చెప్పారు. కూటమి పాలనకు ఆకర్షితులైన ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు శీర రమణయ్య, చిట్టి మోహన్, మూకళ్ల శ్రీనివాస్, మూకళ్ల జయానంద్, వాడాడ భీమారావు పాల్గొన్నారు.

## ఐదేళ్లలో రైతులను ముంచేసి... ఇప్పుడు ధర్నాలా?

చీపురుపల్లి (చైతన్యరథం): అయిదేళ్లలో తోటపల్లి కాలువ అభివృద్ధికి కనీసం రూ.5 కోట్లు కేటాయించని వైసీపీ నాయకులు ఇప్పుడు రైతు సమస్యలంటూ రోడ్డు ఎక్కడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. శనివారం చీపురుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ధాన్యం బస్తాకు అదనంగా 5 నుంచి 10 కిలోల అన్యాయంగా దోచేసేవారని, ధాన్యం సొమ్మును సకాలంలో చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. రూ.1,600 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే చెల్లించిందన్నారు. పేదలకు రూ.వెయ్యి పింఛను పెంచడానికి జగన్ ప్రభుత్వానికి అయిదేళ్లు పట్టిందని, విశాఖ రైల్వే జోన్ను పట్టించుకోకుండా, రైల్వే ప్రాజెక్టులను అడగకుండా, కొత్త పరిశ్రమలను తీసుకురాకుండా కాలయాపన చేశారని విమర్శించారు. చంద్రబాబునాయుడు చొరవతో విశాఖకు టీసీఎస్, గూగుల్ వస్తున్నాయని, చంద్రబాబు విజన్ తెలియాలంటే భాగ్యనగరాన్ని చూడాలన్నారు. నాయకులు పి.బలరాం, ఆర్. కామునాయుడు, ఎస్.సురేష్ కుమార్, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారించడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం

భీమిలి (చైతన్యరథం) : భూ సమస్యలను సత్వరం పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం కాపులుప్పాడలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సుకి హాజరై మాట్లాడారు. ప్రజల భూములపై పెత్తనం చెలాయించేందుకు వైకాపా ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగు యాక్టు రద్దు చేశామన్నారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. విదేశాల్లో ఉంటున్న తన కుమార్తెకి చెందిన 800 గజాల భూమి కబ్జాకు గురయిందని ఏయూ ఆంగ్ల విభాగం విశ్రాంత ఆచార్యులు భాస్కరిణీదేవి (95) చెప్పారు. కొందరు తాము డి పట్టాలు, బంజర్లలో నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని కోరారు. జాయింట్ కలెక్టరు మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, తహసీల్దారు రామారావు, జెడ్పీ ప్రేమ ప్రసన్నవాణి, ఉప తహసీల్దారు శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.



## సకాలంలో ఉపాధి పనులు పూర్తి చేయాలి : బెదాళం



ఇచ్ఛాపురం (చైతన్యరథం): నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కోరారు. రామయ్యపుట్టుగలో నియోజకవర్గస్థాయి ఉపాధిహామీ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పనులు చేపట్టడమే కాక సాగునీటి వనరులు మెరుగుపర్చేందుకు అవకాశాలు పరిశీలన చేయాలని సూచించారు. సాగునీటి కాలువలను మెరుగుపర్చితే పంటలకు నీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టవచ్చన్నారు. గ్రామాల్లో రోడ్లు నిర్మాణంలో పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. కూలీలకు ఎంతమేర వేతనాలు రోజువారీ అందుతున్నాయని, బకాయల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవిలో పనులు సక్రమంగా జరిగి కూలీలు వలసలు పోకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు, టీసీలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

పాడేరు (చైతన్యరథం): రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ అన్నారు. స్థానిక తహసీల్దారు వి.త్రినాథరావునాయుడు అధ్యక్షతన పాతపాడేరు గ్రామ సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ పరమైన సమస్యలపై దరఖాస్తులు, ఫిర్యాదులు అందజేస్తే పరిష్కరిస్తామన్నారు. మ్యుటేషన్, పలురకాల ధ్రువపత్రాల జారీకి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ సరిహద్దు వివాదాలు, భూ ఆక్రమణలు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు జారీ వంటివి చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ, సర్వే విభాగం అధికారులంతా అందుబాటులో ఉంటారని, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతారని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.




## సిక్కోలు మత్స్యకారులు శ్రీలంక జైల్లో మగ్గిపోతున్నారు

శ్రీకాకుళం (చైతన్యరథం): పొట్టకూటికి చెన్నై వలస వెళ్లిన సిక్కోలు మత్స్యకారులు శ్రీలంక జైల్లో మగ్గిపోతున్నారని, వారిని స్వదేశానికి రప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఢిల్లీలో విదేశాంగ మంత్రి జైశంకరును కోరారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం పెద్దగనగళ్లవానిపేటకు చెందిన దాసరి వెంకయ్య, గనగళ్ల కొర్లయ్య ఈ ఏడాది జూన్‌లో మరో 8 మందితో కలిసి బోటులో వేటకు వెళ్లారు. సరిహద్దులు తెలియక వారు శ్రీలంక జలాల్లో ప్రవేశించడం, ప్రమాదవశాత్తూ మరో బోటును ఢీకొనడంతో అక్కడి కోస్టుగార్డు పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ రామ్మోహన్నాయుడి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తక్షణమే స్పందించారు. ఇద్దరు గంగపుత్రులు ఆరు నెలలుగా అక్కడి జైల్లో మగ్గుతున్న విషయాన్ని విదేశాంగ మంత్రి దృష్టి తీసుకెళ్లగా.. ఆయన శ్రీలంక అధికారులతో మాట్లాడారు. కోర్టులో న్యాయ ప్రక్రియ పూర్తికాగానే వారిని స్వదేశానికి పంపుతామని అక్కడి నుంచి సమాచారం అందించారని తెలిసింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకరును కృతజ్ఞతలు తెలిపారు.



# రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారం



వరరామచంద్రాపురం, కూనవరం: పోడు భూముకు పట్టాలిచ్చినా అనుభవదారుగా తమ పేర్లు నమోదు చేయలేదంటూ పలువురు గిరిజన రైతులు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు తెలిపారు. ములకనపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు వచ్చిన పీవో భరత్ ఒక్కో రైతును పిలిచి తమ సమస్యలు చెప్పమని అడిగారు. తహసీల్దార్ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు. గొల్లగూడెం, కొత్తపేట, వీరపాపనకుంట గ్రామాల్లో స్థానిక రెవెన్యూ అధికారులు గ్రామసభలు పెట్టారు. ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వోలు, వీఆర్ఎలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కూనవరం మండలం బొజ్జిరాయిగూడెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సోడే మధుసూధనరావు పాల్గొన్నారు. ఎటపాక, దేవీపట్నం, కన్నాయిగూడెం పంచాయితీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారసత్వ మార్పిడి సమస్యలపై ఎక్కువ మంది ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ సుబ్బారావు మాట్లాడుతూ కన్నాయిగూడెం, సీతంపేట, తాళ్ళగూడెంలో 14 ధరఖాస్తులు వారసత్వ మార్పిడి కోసం వచ్చాయన్నారు. దేవీపట్నం మండలం ఎం. రావిలంకలో శుక్రవారం తహసీల్దార్ కె. సత్యనారాయణ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. గడవకుర్తి, వాతంగి పంచాయతీలలో తహసీల్దార్ సత్యనారాయణ, డీటీ కరీముల్లా ఆధ్వర్యంలో సదస్సులను నిర్వహించి ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. సర్పంచులు చంద్రుడు, శుభలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పెద్దిరాజు పాల్గొన్నారు. మారేడుమిల్లి సున్నంపాడు, దేవరపల్లి, నూరుపూడి గ్రామాల్లో తహసీల్దార్ బాలాజీ గ్రామసభలు నిర్వహించారు. గిరిజనుల నుంచి పలు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించారు. ప్రత్యేకాధికారి చైతన్య, ఆర్ఎ ఏసుబాబు, వీఆర్వో రాజేశ్వరి పాల్గొన్నారు.

# పోలీస్ నేమ్ బోర్డుతో గంజాయి రవాణా



విజయనగరం జిల్లాలో318 కిలోల గంజాయి:

పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం పాచిపెంట పోలీసు వారికి వచ్చిన సమాచారం మేరకు మతమూరు గ్రామం దగ్గరలో వేటగానివలస జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అరకు సాలూరు రోడ్డు నుంచి తెల్లని కారు నంబర్ ప్లేట్లు లేకుండా రావడంతో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఆ కారులో ఇద్దరు వ్యక్తులతో సహా 9 బ్యాగుల గంజాయి దొరికింది. ఆ ఇద్దరు వ్యక్తులను విచారించగా అందులో మొదటి వ్యక్తి పేరు మద్దాల వంశీ, అతను ఆ కారుని డ్రైవ్ చేస్తూ వచ్చి అతనితో పాటు రెండో వ్యక్తి అయిన సుబ్బారావును సైతం పోలీసులు విచారించారు. అయితే పెదబయలు ఏరియాలో ఈ గంజాయిని బాలు అనే వ్యక్తి వద్ద నుంచి కొని కారులో లోడ్ చేసుకొని అరకు సాలూరు రోడ్డు లోతేరు మీదుగా వస్తుండగా మాతమూరు జంక్షన్ వద్ద వీరు పోలీసులకు పట్టుబడ్డారు. కారులో మొత్తం తొమ్మిది బ్యాగుల్లో సుమారు 318 కేజీలు గంజాయి ఉంది. గంజాయిని విజయనగరం హైవేలో రాజస్థాన్ కు చెందిన లారీల్లో లోడ్ చేసి వరంగల్ మీదుగా వెళుతున్నట్లు తెలిసింది. వీరి వద్ద నుంచి గంజాయి, కారు, రెండు సెల్ఫోన్లను సీజ్ చేశారు. గంజాయి విలువ సుమారు 16 లక్షలు ఉంటుందని పోలీసులు ప్రకటించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ తెలిపారు.

గంజాయి రవాణాకు పుష్ప సినిమా తరహాలో నిందితులు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. పోలీసులమని చెప్పి వాహనానికి ఏకంగా బోర్డు ఏర్పాటు చేసి తరలిస్తున్న వైనం పార్వతీపురం మన్యం జిల్లాలో వెలుగు చూసింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు తెలిపారు. ఒడిశా నుంచి బొగ్గు లారీ, రెండు వ్యానుల్లో గంజాయి తరలిస్తుండగా కొట్టక్కి చెక్ పోస్టు వద్ద పట్టుకున్నామని, మూడు వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన హక్కూం సోలంకి, ఆయన కుమారుడు అనిల్ సోలంకి, ఒడిశా వాసి జ్యోతిభూషణ్ బెహరాను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు. వీరి వద్ద 810 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, వాహనాలకు పోలీస్ బోర్డుతో పాటు ఫేక్ నంబర్లు పెట్టుకొని రవాణా చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

# బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు



ఏలూరు (చైతన్యరథం): యాభై సంవత్సరాలు పైబడిన ఓ వ్యక్తి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నేరానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. అధికారుల కథనం ప్రకారం.. దెందులూరులోని ఓ ప్రాంతంలో తల్లి మృతి చెందడం, తండ్రి వ్యసనాలకు బానిస కావడంతో ఓ ఆరేళ్ల బాలిక నాయనమ్మ వద్ద ఉంటోంది. వారి ఇంటి పక్కనే సున్నా ఆంథోనిరాజ్ అనే వ్యక్తి చిల్లర దుకాణం నిర్వహిస్తుంటాడు. 2022 అక్టోబరు 8న మధ్యాహ్నం వేళ ఆ బాలిక కుర్కురే ప్యాకెట్లు కొనుక్కునేందుకు దుకాణం వద్దకు వెళ్లింది. అప్పుడు ఎవరూ లేకపోవడంతో ఆంథోనిరాజ్ బాలికను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తరువాత విషయం తెలుసుకున్న బాలిక నాయనమ్మ దెందులూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై వీర్రాజు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అప్పటినుంచి కేసు వాదోపవాదాలు జరుగుతున్నాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డీవీ రామాంజినేయులు, బ్రహ్మయ్య బాధితుల పక్షాన వాదించారు. కేసు తుది విచారణను శుక్రవారం ఏలూరులోని జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్. ఉమాసునంద చేపట్టారు. సాక్షులను విచారించారు. నేరం రుజువైనందున నిందితుడైన ఆంథోని రాజ్కు జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పాటు రూ. 5 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



పోలవరం (చైతన్యరథం): రాష్ట్ర సీఎం చంద్రబాబు ఈ నెల 16న పోలవరం ప్రాజెక్టు సందర్శించనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా భద్రత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ వేట్రి సెల్వీ, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీసులను సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, సందర్శకుల అనుమతులు, అత్యవసర సేవల కోసం ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని సూచించారు. వారి వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ ధాత్రి రెడ్డి, అదనపు ఎస్పీ ఎన్ సూర్య చంద్రరావు, పోలవరం డీఎస్పీ ఎం వెంకటేశ్వరరావు ఉన్నారు.

# భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



కడియం (చైతన్యరథం): రైతుల భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు అని డిప్యూటీ కలెక్టర్ కె.వేదవల్లి తెలిపారు. దుళ్లలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మ్యూటేషన్ కోసం 5, ఎఫ్‌లైను కోసం 4 ధరఖాస్తులు వచ్చాయని తహసీల్దారు కె.పోశిబాబు తెలిపారు. వీటితో పాటు రీసర్వే సరిగా లేదని, సర్వే నివేదికలు అందలేదని, సర్వే నెంబర్లలో హెచ్చు తగ్గులు, విస్తీర్ణంలో లోటుపాట్లు ఉన్నాయని, పాస్‌బుక్‌లు మంజూరు కాలేదని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చిట్టూరి అమ్మిరాజు, గుర్రపు సత్యనారాయణ, కూటమి నాయకులు కంటిపూడి శ్రీను, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, సూరపురెడ్డి భరత్, మెర్ల అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



ఆముదాలవలస (చైతన్యరథం): రైతులకు మద్దతు ధరను అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేం ద్రాలు ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం శ్రీనివాసాచార్యులపేట రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు సేకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేపట్టి మద్దతు ధర దక్కేలా అందేలా చూడాలన్నారు. తమే శాతం పేరుతో రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశీలనలో పంచాయతీ సెక్రటరీ బగాది నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం



అమరావతి (చైతన్యరథం): గుంటూరు జిల్లా తాడేపల్లి మాదిగ సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మాదిగ సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ ఛైర్పర్సన్‌గా నియమితులైన డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొని ఉండవల్లి శ్రీదేవికి శుభాకాంక్షలు తెలియజేసిన ఏపీ ప్రభుత్వ విప్, శాసనసభ్యులు తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని భవిష్యత్తు రోజులలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం, మరియు మాదిగ జాతిని సంక్షేమ రంగంలో ముందుకు తీసుకువెళ్లడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేశారు.

# ఉద్యోగ మేళాలో 1535 మంది ఎంపిక

● జాబ్ మేళా కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



గన్నవరం (చైతన్యరథం): రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిరుద్యోగులు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఎనికెపాడులో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఉద్యోగాల హామీ ఇచ్చారని తెలిపారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని నియోజకవర్గ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహించినట్లు చెప్పారు. ఉద్యోగ మేళాకు యువత నుండి విశేష స్పందన కనిపించిందని తెలిపారు. ఉద్యోగ మేళాలో మొత్తం 3125 మంది హాజరుకాగా.. 1535 మందికి వివిధ కంపెనీల్లో ఎంపిక అయ్యారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కంపెనీలు వెనక్కి తిరిగి వెళ్ళిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్ ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు కూడా నిరుద్యోగులుగా మారిపోయారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో యువత గంజాయి బారిన పడ్డారన్నారు. జగన్ తన పాలనలో రాజకీయ నిరుద్యోగులకు మాత్రమే ఉపాధి కల్పించారని విమర్శించారు. "నేను కేడీసీసి బ్యాంకును అభివృద్ధి చేస్తే అప్పటి ముఖ్యమంత్రి జగన్ నన్ను ఎందుకు చైర్మన్ బాధ్యతల నుంచి తప్పించారు" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, కార్పొరేట్ కంపెనీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. చంద్రబాబు సర్కార్ ఏర్పడిన తరువాత మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌కు పునర్జీవం పోశారన్నారు. నాడు జగన్ ప్రభుత్వం పేరు చెబితేనే పరిశ్రమలు పారిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మెగా జాబ్ మేళాలో 50 కంపెనీలు పాల్గొని ఉద్యోగ కల్పనకు అవకాశాలు కల్పించారని తెలిపారు.

సింగ్‌నగర్‌లో వరదలు వస్తే ఏ వైసీపీ నాయకులైన వచ్చారా అని డిగారు. "చంద్రబాబు మా మీద పోటీ చేసి గెలువు అని సవాల్ విసిరిన నాయకులు ఇప్పుడు ఏమయ్యారు" అంటూ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రశ్నించారు. రాష్ట్రంలో తిరిగి వెళ్ళిన కంపెనీలు వెనక్కి రావడానికి సీఎం చంద్రబాబు కృషి ఎంతో ఉందన్నారు. చిన్న చిన్న పనులు కూడా వైసీపీ ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. 60 సంవత్సరాల వయసులో పార్టీ పెట్టిన వ్యక్తి ఎన్టీఆర్ అని పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలని 2 రూపాయలకు కిలో బియ్యం పథకం తెచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆ పథకానికి కూడా గత ప్రభుత్వం తూట్లు పొడిచిందని విమర్శించారు. ఇచ్చిన హామీ మేరకు యువతకు ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొన్న 53 కంపెనీలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలకు సెలెక్ట్ అయిన వారికీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు.

# మంచిని అమలు చేసే వారికే ఉజ్వల భవిష్యత్: చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): నేర్చుకునే మంచిని ఇలా విని అలా వదిలివేయడం కాకుండా అర్థం చేసుకుని, అమలు చేసే వారే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరతారని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. చదువుకు విలువలు, ఆశయాలు, మంచి ప్రవర్తనను అలవరుచుకునే వారికి అద్భుతవిజయాలు వరిస్తాయన్నారు. వినుకొండలోని ఇంటర్ విద్యార్థులకు శనివారం గంగినేని ఫంక్షన్ హాల్‌లో శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీస్థాయిలో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సినీనటుడు, ప్రముఖ స్ఫూర్తి వక్త కేవీ ప్రదీప్ ముఖ్య అతిథిగా పాల్గొని విలువలు, వికాసం, నాయకత్వ లక్షణాలు గురించి అవగాహన కల్పించారు. మోటివేషనల్ స్పీకర్స్ రావులపల్లి పుల్లారావు, మొలకా గోవర్ధనుడు, గజవల్లి వెంకటసుబ్బయ్య అవగాహన కల్పించారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. రావులపల్లి పుల్లారావు రచించిన గెలుద్దాం పదా..? పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివిధ కళాశాలల నుంచి 2 వేలమందికిపైగా విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ వ్యక్తిత్వవికాసంలో ఆదిగురువులు అమ్మనాన్నలే అన్నారు.

సాధారణ రైతు కుటుంబం నుంచి అప్పులు, కష్టాలకు ఎదిరీది తాను గెలిచిన జీవితం పాఠాలు నేర్పింది కూడా అదే అని తెలిపారు. 15 రాష్ట్రాల్లో వ్యాపారాలు, 5వేల మంది ఉద్యోగులు ఉన్నా... జన్మభూమి రుణం తీర్చుకుందామని రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. అక్కడ విద్యార్థుల్లో ఎంతోమంది తనకంటే ఉన్నతస్థానాలకు చేరుకోవాలని కోరుకుంటానంటూ విద్యార్థులను ఉత్తేజపరిచారు. జీవితంలో ఎవరైనా మంచి చెబితే వినాలని, తన వరకు అయితే 100లో మంచిని వినడం, అర్థం చేసుకోవడానికి 1మార్కు, నేర్చుకున్నది, తెలుసుకుంది అమలు చేయడానికి 99 మార్కులు వేస్తానంటూ స్ఫూర్తి పాఠాలు చెప్పారు.

# ఆరు నెలల్లోనే అద్భుతమైన ప్రగతి : మన్నవ మోహనకృష్ణ

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ అస్తిత్వమే ప్రశ్నార్థకమయిన వేళ రాష్ట్ర భవిష్యత్తును కాచుకోవడమే లక్ష్యంగా విధ్వంస ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టింది కూటమి ప్రభుత్వం. ఐదు కోట్ల ఆంధ్రుల ఆశల, ఆకాంక్షల బరువును మోస్తూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనను పూర్తి చేసుకుంది. ఈ ఆరు నెలల్లోనే అద్భుతమైన ప్రగతి సాధించడంతో పాటు ఇది మంచి ప్రభుత్వమని ప్రజల నుంచి మన్ననలు పొందడం తమకు ఎంతో సంతోషంగా ఉందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో అధోగతి పాలైన ఆంధ్రప్రదేశ్‌ని అభివృద్ధి బాట పట్టించడానికి ఆరునెలలుగా సీఎం నారా చంద్రబాబునాయుడు అలుపెరుగకుండా శ్రమిస్తున్నారని మోహనకృష్ణ కొనియాడారు. ఈ మేరకు శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మోహనకృష్ణ మీడియాతో మాట్లాడుతూ... ప్రజలకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించడానికి, స్వర్ణాంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరించడానికి సీఎం చంద్రబాబునాయుడు కాలంతో పోటీ పడుతున్నారని, గత ఐదేళ్ల పాలనలో దగా పడ్డ మధ్య తరగతి, అట్టడుగు ప్రజలు వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా అన్ని వర్గాల జీవనాన్ని గుణాత్మకంగా మార్చే బృహత్తర లక్ష్య సాధన కోసం విలక్షణమైన ప్రజా సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఖజానా దివాలా తీసివున్నా ఆరు నెలల్లోనే 400కు పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించి చంద్రన్న ప్రభుత్వం రికార్డు సృష్టించిందని, ప్రతిపక్ష నేతగా జగన్ వైఫల్యం చెందాడని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని, జగన్ కుంభకోణాలు నుండి ప్రజాదృష్టి మళ్ళించడానికే ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మోహనకృష్ణ మండిపడ్డారు.



# హిందూ ధర్మాన్ని గళ్ళా మాధవి కించపరచలేదు

●వెల్లడించిన ఇస్కాన్ ప్రతినిధి విలాస విగ్రహదాన్



తాడేపల్లి(చైతన్యరథం): కుంచనపల్లిలోని "హరే కృష్ణ గోకుల క్షేత్రం" నందు శనివారం జరిగిన లక్ష్మీనరసింహస్వామి హోమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొన్నారు. అనంతరం రాధాకృష్ణులను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఉచితంగా భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఇస్కాన్ ప్రతినిధి విలాస విగ్రహదాన్‌తో కలిసి గళ్ళా మాధవి మీడియా సమావేశం నిర్వహించారు. పరమ పవిత్ర గ్రంధంగా భావించే భగవద్గీతను రోడ్లపై అమ్మడం సరైంది కాదని, అందు కోసం ప్రత్యేక ప్రాంతాన్ని తన నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఇస్కాన్ ప్రతినిధులకు మాట ఇచ్చారని, కానీ ఈ విషయాన్ని కొంతమంది సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తగదని తాడేపల్లి ఇస్కాన్ ప్రతినిధి విలాస విగ్రహదాన్ వెల్లడించారు. ఇటీవల గుంటూరులో జరిగిన సంఘటనలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి తప్పుమేమి లేదని, సమన్వయలోపంతో ఏర్పడిన దానిని రాజకీయం చేయడం తగదని స్కాన్ ప్రతినిధి విలాస విగ్రహదాన్ వెల్లడించారు. ఎమ్మెల్యే మాధవి మొదటి నుంచి ఇస్కాన్‌కి ఎంతో అండగా నిలుస్తూ వస్తున్నారని, గీతా జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం భగవద్గీత గీతా మకరందం అనే పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తూ ఉంటారని, అటువంటి వారు సనాతన ధర్మాన్ని అడ్డుకున్నారని ప్రచారం చేయడం భావ్యం కాదన్నారు.

హిందూ ధర్మాన్ని కించపరచలేదు : ఎమ్మెల్యే గళ్లా మాధవి

తాను ఎక్కడ కూడా హిందూ ధర్మాన్ని కించపరచలేదని, కావాలనే తనపై కొంత మంది సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన గ్రంధాన్ని నడిరోడ్డుపై అమ్మడం సరికాదని అందు కోసం ప్రత్యమ్నాయంగా ఒక స్టాల్‌ను ఏర్పాటు చేస్తానని హామీ కూడా ఇచ్చానని మాధవి తెలిపారు. జరిగిన సంఘటన వీడియో మొత్తాన్ని తొలగించి కేవలం చివరి 30 సెకండ్ల వీడియో మాత్రమే చూపించటంలో ఉన్న దురుద్దేశం ఏమిటో నాకు అర్థం కావట్లేదన్నారు. ఎక్కడ కూడా వీటిని అమ్మవద్దు అని చెప్పలేదని, ఇందులో హిందూ ధర్మాన్ని కించపరచటం, అడ్డుకోవటం లాంటి ఎలాంటి దురుద్దేశాలు లేవన్నారు. హిందూ ధర్మాన్ని ఆచరించే నా మీద ఇలాంటి వార్తలు రావటం బాధాకంమని, జరిగిన విషయాలను ప్రజలు, భక్తులు సహృదయంతో అర్థం చేసుకోవాలని మాధవి కోరారు.

# జగ్గయ్యపేట మున్సిపల్ వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తాం : శ్రీరాం తాతయ్య



జగ్గయ్యపేట (చైతన్యరథం): పట్టణంలోని ఊర చెరువు బుద్ధ విహార్ వద్ద ఉన్న వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నట్లు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలిపారు. ఇటీవల చెరువులో నీటిలో విపరీతంగా పెరిగిన తూటు కాడను తొలగించడం జరిగిందని, తొలగించిన తూటుకాడను వాకింగ్ ట్రాకపై పడవేయటంతో వాటిని తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఊర చెరువు వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయడంతోపాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వాకింగ్ ట్రాక్‌కు రెండువైపులా ఆహ్లాదకరంగా పచ్చదనాన్ని పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ మున్సిపల్ వాకింగ్ ట్రాక్ ను దశలవారీగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు.అలానే వచ్చిన వాకర్స్‌కి కూర్చోవడానికి వీలుగా బెంచీలు, ఓపెన్ జిమ్, మినీ క్యాంటీన్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కన్నెబోయిన రామలక్ష్మి, ఇర్రీ నరసింహారావు, నకిరకంటి వెంకట్, పేరం సైదేశ్వర రావు,కర్ల జోజి, తమ్మిశెట్టి నరసింహారావు, సతీష్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సాగు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడుగా "ఆళ్ళ"

కృష్ణాజిల్లా వ్యాప్తంగా జరిగిన సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నిక ప్రక్రియలో భాగంగా కృష్ణాజిల్లా బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ బాపులపాడు మేజర్ పరిధిలోని రంగన్నగూడెం సాగు నీటి వినియోగదారుల సంఘం నెం.79కి శనివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ప్రాదేశిక నియోజకవర్గం సభ్యునిగా ఏకగ్రీవంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ఎన్నికైయారు. సాయంత్రం జరిగిన ప్రత్యేక సమావేశంలో 12 మంది ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావును 4వ సారి రంగన్నగూడెం సాగు నీటి వినియోగదారుల సంఘానికి ఏకగ్రీవంగా అధ్యక్షుడుగా ఎన్నుకోగా ఈ ఎన్నికను ఎన్నికల అధికారి కొమ్మ విజయ్ అధికారికంగా ప్రకటించి ధృవీకరణ పత్రాన్ని "ఆళ్ళ"కు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆళ్ళకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



# ఆర్తులకు ఆసరా సీఎం సహాయనిధి

**- మంత్రి డాక్టర్ డోలా**

టంగుటూరు, (చైతన్యరథం) : సీఎం సహాయ నిధి రాష్ట్రంలోని ఎందరో పేదలకు ఆసరాగా నిలుస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం తూర్పునాయుడు పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి స్వామి సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్దిదారులు ముఖ్యమంత్రికి,మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా..**



మదనపల్లె (చైతన్యరథం) : ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఆరు గురికి రూ. 20 లక్షల చెక్కులను శనివారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధికి పలువురు దరఖాస్తులు చేసుకోగా వారిలో కొంత మందికి చెక్కులు మంజూరయ్యాయి. వాటిని ఎమ్మెల్యే స్వయంగా వారి, వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. పట్టణంలోని ప్రభావతి, హర్షవర్ధన్, సహదేవరెడ్డి, రేవంత్, అంజమ్మ, రహీమున్నిసాలు చెక్కులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. పేదలకు అండగా నిలిచేది తెలుగుదేశం ప్రభుత్వం ఒక్కటే అన్నారు.

## అన్నప్రసాద భవనానికి ఎమ్మెల్సీ శ్రీకాంత్ విరాళం



కందుకూరు, (చైతన్యరథం) : పట్టణంలో కనిగిరి రోడ్డులోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణంలోని శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న అన్న ప్రసాద భవనానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రూ 1,11,116ల విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్య గురుస్వామి కెఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకట నరసింహ, నల్లబోతుల మురళి మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి, మాదాల నర్సింగరావు పాల్గొన్నారు.

## ఘనంగా పాతపాటి శతాబ్ది ఉత్సవాలు

**- గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్**



గూడూరు(చైతన్యరథం) : పాతపాటి సుబ్రహ్మణ్యం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని సరస్వతీ శిశు మందిరంలో ఏర్పా టు చేసిన డిజిటల్ స్క్రీన్ ప్రొజెక్టర్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రకటించారు. పాతపాటి కుటుంబ సభ్యుల దాతృత్వంతో డిజిటల్ ప్రొజెక్టర్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా చదువుల తల్లి సరస్వతి విగ్రహానికి పూజలు నిర్వహించారు. చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి , డాక్టర్ జనార్దన్‌రెడ్డి, పురుషోత్తం, బిల్లు చెంచు రామయ్య , సనత్‌కుమార్ రెడ్డి , బాబు, పాదర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .







## నిరుపేదల ఆశీస్సులే చంద్రబాబుకు శ్రీరామ రక్ష

**- 4 విడతలలో రూ. 28,94,245 సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ**

**- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

నెల్లూరు, (చైతన్యరథం) : అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే అనారోగ్య పీడితులకు నాలుగు సార్లు ముఖ్యమంత్రి సహాయనిధి అందచేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. నెల్లూరు నగరం మాగుంట లే అవుట్ లోని వీపీఆర్ నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చేతుల మీదుగా బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి చెందిన చంద్రగిరి దేవరాజుకు 66 వేల 6 వందల 51 రూపాయలు, ఇందుకూరు పేట గ్రామానికి చెందిన కాకాని నీరజకు 35 వేలు, కోవూరుకు చెందిన పాకం సుజాతకు 85 వేల 44 రూపాయలు, కొడవలూరు వాసి మారంరెడ్డి కౌసల్యమ్మకు 2 లక్షల 2 వేల 483 రూపాయలు, మొత్తం 3 లక్షల 88 వేల 578 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల రూపంలో అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటి వరకు 28 లక్షల 94 వేల 245 రూపాయల చెక్కులు పంపిణీ చేశామని వివరించారు. చెక్కులు అందుకున్నవారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో విడవలూరు టీడీపి ఇంచార్జి అడపాల శ్రీధర్ రెడ్డి, యువ నాయకులు బెజవాడ వంశీ రెడ్డి, బుచ్చిరెడ్డి పాళెం టీడీపీ ఇంచార్జి అడపాల అనీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

**- పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్..**



పూతలపట్టు (చైతన్యరథం) : నియోజకవర్గాన్ని పారిశ్రా మికంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. శనివారం పూతలపట్టు మండలం, బందార్లపల్లి గ్రామంలో రూ. 23 కోట్లతో నిర్మిస్తున్న ప్రైవేట్ సోలార్ ప్రాజెక్ట్ పనులకు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పూతలపట్టు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అదే విధంగా పారిశ్రామిక ప్రోత్సాహకులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలను అందించేందుకు ప్రభుత్వం తరపున కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో పారిశ్రామిక వృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచడం, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలను అందించడం తన ప్రధాన లక్ష్యమని, పరిశ్రమల అభివృద్ధి ద్వారా పూతలపట్టు నియోజకవర్గం ఆర్థికంగా, సామాజికంగా దృఢంగా ఎదగగలదని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, సోలార్ ప్రాజెక్టు కంపెని యజమాని నవీన్ చౌదరి, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఒంగోలులో కూటమి జయకేతనం

**సాగునీటి సంఘాల విజేతలను అభినందించిన ఎమ్మెల్యే దామచర్ల**



ఒంగోలు, (చైతన్యరథం) : నియోజకవర్గంలో 12 సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు 11 మంది జనసేన మద్దతు దారు ఒక్కరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజేతలైన అధ్యక్షులతోపాటు ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అభినందించి వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. యరజర్ల సాగునీటి సంఘం చైర్మన్‌గా గోదాసు వెంకట స్వామి (జనసేన), వైస్ చైర్మన్‌గా కంకణాల ఆంజనేయులు (బీజేపీ), కొత్తమామిడిపాలెం చైర్మన్‌గా పెండ్యాల రోశయ్య, వైస్ చైర్మన్‌గా మేదరమిట్ల రవిచంద్ర బాబు, వల్లూరు, చైర్మన్‌గా కంకణాల వేణు, వైస్ చైర్మన్‌గా పెళ్లూరు వెంకటేశ్వర్లు, కొప్పోలు -1 చైర్మన్‌గా బత్తిన కృష్ణమూర్తి, వైస్ చైర్మన్‌గా జిల్లమూడి నరసింహారావు, కొప్పోలు -2, చైర్మన్‌గా పోతినేని వేణు, వైస్ చైర్మన్‌గా కాట్రగడ్డ రాఘ వరావు, అల్లూరు, చైర్మన్‌గా బంకా వెంకయ్య, వైస్ చైర్మన్‌గా బొమ్మిరెడ్డి శీనారెడ్డి, అలూరు, చైర్మన్‌గా కనుబడ్డీ పుల్లారెడ్డి, వైస్ చైర్మన్‌గా గాదె లింగారెడ్డి, ఈతముక్కల -2, చైర్మన్‌గా బద్దేలి రామసుబ్బారెడ్డి, వైస్ చైర్మన్‌గా మచ్చా మోహనరావు, ఈతముక్కల -1,చైర్మన్‌గా సూరగాని కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా పొన్నపూడి చిన్న, పెళ్లూరు చెరువు చైర్మన్‌గా మద్దూలూరి అయ్యన్న, వైస్ చైర్మన్ -నాగం వెంకటేశ్వర్లు(జనసేన), పాదర్తి చెరువు, చైర్మన్‌గా ముగా పోలరాజు, వైస్ చైర్మన్‌గా వాటంశెట్టి శ్రీరాములు, అల్లూరు చెరువు, చైర్మన్‌గా గుత్తికొండ వెంకట సుబ్బమ్మ, వైస్ చైర్మన్‌గా మితశాల జయరాం ఎన్నికయ్యారు.

## రైతుల సంక్షేమమే ధ్యేయంగా సాగునీటి సంఘాలు పని చేయాలి

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, చైతన్యరథం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసి మెంబర్లు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం నాయుడుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సాగునీటి సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్ష టిసి మెంబర్లకు సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 144 సాగునీటి సంఘాలకు పారదర్శకంగా ఎన్నికల నిర్వహించినట్లు తెలిపారు. 144 నీటి సంఘాలకు ప్రశాంతంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష ఉపాధ్యక్ష మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. సాగునీటి సంఘాల ఏకగ్రీవంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష, టిసి మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కృషిచేసిన అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గంలో భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ ఎంపీ టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సాగునీటి సంఘాలు ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించినట్లు తెలిపారు. టీడీపీకి ప్రజాభిమానంతో పాటు బలమైన నాయకులు కార్యకర్తలు ఉండటం వల్ల సాగునీటి సంఘ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి అని తెలిపారు. సాగునీటి సంఘ అధ్యక్ష ఉపాధ్యక్షులు రైతులను సమన్వయం చేసుకొని పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో ఎక్కడ సాగునీటి కొరత రాకుండా చూడాలని కోరారు.

## ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- ఏకగ్రీవంగా టీడీపీ మద్దతుదార్ల కైవశం
- ఫలించిన రాయచోటి టీడీపీ నేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి మంత్రాంగం



గాలివీడు, (చైతన్యరథం) : గాలివీడు మండలంలో నిర్వహించిన మూడు నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు రాయచోటి నియోజకవర్గ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి వెల్లడించారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో శనివారం మూడు నీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో గాలివీడు పెద్ద చెరువు నీటి సంఘం అధ్యక్షులుగా చెక్కా రామాంజనేయులు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు లక్ష్మీప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ధృవీకరణ పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ శనివారం గాలివీడు మండలంలో జరిగిన నీటి సంఘం ఎన్నికలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం విశేషమన్నారు. అన్నమయ్య జిల్లాలో జరిగే నీటి సంఘం ఎన్నికలు నియమ నిబంధనల ప్రకారం జరిగే విధంగా ఏర్పాట్లు జరిగాయన్నారు.

# ఇక మూడు నెలలకోసారి మెగా జాబ్ మేళా

### నిరుద్యోగ సమస్య పరిష్కారమే లక్ష్యం: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

- వందకు పైగా ఐటీ నాన్ ఐటీ కంపెనీల ప్రాతినిథ్యం
- పది వేల మందికి జాబులివ్వడమే ధ్యేయం
- సీఎం చంద్రబాబు ప్రేరణతోనే భారీ ఏర్పాట్లు



నెల్లూరు, (చైతన్యరథం) : యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీని మెగా జాబ్ మేళా ద్వారా నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా వివరాలను ఆమె మీడియాకు వివరించారు. మూడు నెలల క్రితం సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు 1,000 కి పైగా యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రూపుమాపాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రేరణతో వారి ఆకాంక్షల మేరకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. రానున్న ఆదివారం విపిఆర్ కన్వెన్షన్లో జరిగే మెగా జాబ్ మేళా సందర్భంగా 100 కు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటాయన్నారు.

ఈ సారి విప్రో, టెక్ మహేంద్ర లాంటి 14 ప్రముఖ ఐటి కంపెనీలు జాబ్ మేళాలో ప్రాతినిధ్యం వహించనున్నాయన్నారు. ఈ సారి జరిగే జాబ్ మేళా ద్వారా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 10 వేల మందికి పైగా యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎమ్మెల్యే ప్రశాంతి తెలిపారు. నిరుద్యోగుల కళ్ళలో ఆనందం చూడాలన్నది ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆశయమన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ నిర్వహించే సామాజిక సేవలో భాగంగా తమ వంతు సహాయంగా నిరుద్యోగ యువత కోసం విపిఆర్ ఫౌండేషన్ జాబ్ మేళా నిర్వహిస్తుందన్నారు.

అనంతరం తెలుగుదేశం నాయకులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సోదరులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో వీపీ ఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విడవలూరు టీడీపీ ఇంచార్జి అడపాల శ్రీధర్ రెడ్డి, యువ నాయకులు బెజవాడ వంశీ రెడ్డి, బుచ్చిరెడ్డి పాళెం టీడీపీ ఇంచార్జి అడపాల అనీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాదమరిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- పాల్గొన్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



పూతలపట్టు, (చైతన్యరథం) : ఎన్నికలకు ముందే పోతలపట్టు నియోజకవర్గంలోని యాదమరి మండల ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే మాట నిలబెట్టుకున్నారు. శనివారం ఉదయం యాదమరి మండలం, కాశిరాళ్ళ గ్రామం వద్ద జరిగిన యాదమరి - గుడియాత్తం రోడ్డు అభివృద్ధి పనులకు చిత్తూరు కలెక్టరు సుమిత్ కుమార్ ఐఏఎస్ తో పాటుగా పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూతలపట్టు నియోజకవర్గం నుండి విశేషంగా హాజరైన నాయకులు, కార్యకర్తలు, యాదమరి మండల ప్రజల నడుమ ఈ భూమి పూజ కార్యక్రమం పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే చొరవతో యాదమరి - గుడియాత్తం రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. యాదమరి ప్రజల ఐదేళ్ళ కళను నెరవేర్చిన ఎమ్మెల్యే మురళీమోహన్ కి యాదమరి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేసారు. ఎన్నికలకు ముందు రోడ్డు కోసం గ్రామస్తులతో కలిసి నిరసన చేపట్టిన మురళీమోహన్ పై గత ప్రభుత్వం కేసులు కూడా పెట్టించింది. ఇచ్చిన హామీ మేరకు ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోపే రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మురళీమోహన్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. యాదమరి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకూ మాట నిలబెట్టుకోవడం జరిగిందని, మొత్తం 7.10 కోట్ల రూపాయలతో యాదమరి రోడ్డు పనులు చేపడుతున్నామని, వీలైనంత త్వరగా యాదమరి - గుడియాత్తం రోడ్డును నిర్మిస్తామన్నారు. తన జీవితంలో మొట్టమొదటి కేసు ప్రజల పక్షాన ప్రజా సమస్యలపై పోరాడుతుంటే నమోదు అయిందని, దానికి తాను ఏమాత్రం భయపడకుండా పోరాటం సాగించినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలపరిచేందుకు అవసరమైన పరిశ్రమలు తీసుకొస్తానని, అందుకు కావాల్సిన ప్రతిపాదనను తయారు చేశామన్నారు. నారా చంద్రబాబుకు ఇచ్చిన మాట ప్రకారం ఎల్లప్పుడూ ప్రజలతోనే ఉంటూ ప్రతి ఇంటికి పెద్ద కొడుకై సమస్యలు పరిష్కారిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం నాయకులు, అధికారులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే బియ్యపు వీరంగం



- శ్రీకాళహస్తిలో ఒక్క ఇల్లు కూడా ఉండనీయనంటూ బెదిరింపులు
- నది ఆనుకుని బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాలు...
- ప్రభుత్వ స్థలమని తెలిసినా దర్జాగా నిర్మాణం
- తొలగించేందుకు వచ్చిన అధికారులపై బూతు పురాణం
- పట్టించుకోని యంత్రాంగం.. ఆగని తొలగింపు ప్రక్రియ
- వైసీపీ నేతల తీరుపై మండిపడ్డ పట్టణ ప్రజలు

శ్రీకాళహస్తి (చైతన్యరథం) : శ్రీకాళహస్తి పట్టణంలో స్వర్ణముఖి నదికి రెండు వైపులా కరకట్ట ఉంది. ఓ వైపు దేవస్థానం ఫ్లడ్‌వాల్ నిర్మించగా మరో వైపు ప్రాంతంలో రోడ్డు నిర్మాణం ఉంది. అంతేకాకుండా దేవస్థానికి చెందిన కోట్లాది రూపాయిల విలువైన స్థలం కూడా ఆనకట్ట పక్కనే ఉంది. సర్వే నెంబర్ 218 ప్రకారం ఇక్కడ 60 రోడ్డు ఉండాల్సి ఉంది. నిబంధనల ప్రకారం కరకట్ట ఆనుకుని బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు వీలు లేదు. కానీ ఇక్కడ మాజీ ఎమ్మెల్యే పెద్ద అనుచరుడి ప్రైవేటు అతిథిగృహం ఉంది.

గత వైకాపా ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే అనుచరుడు నది కరకట్ట ఆనుకుని దర్జాగా నిర్మాణాలు చేపట్టారు. కట్ట ఆనుకునే ఏకంగా ప్రహరి నిర్మాణం కూడా చేపట్టేశారు. దేవస్థానం ప్రాంతంలో ఇటీవల రోడ్డు పైకి వచ్చిన వాటిని జేసీబీలతో తీయించారు. నది కరకట్ట వద్ద కూడా బఫర్ జోన్‌లో నిర్మించిన గోడతో పాటు, దేవస్థాన స్థలంలో చేపట్టిన ఆక్రమణలను తొలగింపు కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు శనివారం ఆక్రమణల చోటుకు వచ్చి తొలగింపు ప్రారంభించారు. తన అనుచరుడి నిర్మాణాలు తొలగిస్తున్న విషయం తెలసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన తనయుడు, అనుచరులు, మందిమార్బలంతో సంఘటన స్థలం వద్దకు వచ్చి హంగామా సృష్టించాడు. తొలగిస్తున్న జేసీబీ పైకి వెళ్లి వాహన డ్రైవర్‌ను బెదిరించి దానికి అడ్డంగా కూర్చుని ఎవరొస్తాడో రండి రా.. తెల్చుకుందామంటూ సవాళ్లు విసిరాడు. అనుచరులందర్నీ వెంట పెట్టుకుని గంటల పాటు అక్కడ వీరంగం సృష్టించాడు. అధికారులు ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సంఘటన స్థలంకు వచ్చి అక్కడ నిర్మాణం చేపట్టిన వైకాపా అనుచరుడికి ఆక్రమణ గురించి తెలియజేశారు.



బఫర్ జోన్‌లో కబ్జాలకు పాల్పడ్డారని అందుకే తొలగిస్తానమంటూ కమిషనర్ వారికి తెల్చిచెప్పారు. తమకు నోటీసు ఇవ్వలేదని నోటీసు ఇస్తే సమాధానం చెప్పతామని జేసీబీలతో వస్తే చూస్తూ ఊరుకోబోమని చెప్పడంతో ఆయన విషయాన్ని అర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. శ్రీకాళహస్తిలో కట్టిన కట్టడాలన్ని అక్రమమేనని అందరి ఇళ్లు తొలగిస్తానంటూ మాట్లాడంపై ఇటు ప్రతిపక్షాలు, అధికారపక్షం తీవ్రస్థాయిలో మండిపడింది. ఆయన మాటలు వెన్నిక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశాయి. నియోజకవర్గాన్ని ఐదేళ్లలో కాలంలో దోచేసి అక్రమంగా నిర్మాణాలు చేపట్టింది కాకుండా, అందరి ఇళ్లు కూల్చేస్తామని బెదిరించడం మంచి పద్ధతి కాదన్నారు. ఎక్కడా ఎవరూ ఆక్రమణలకు పాల్పడలేదని అలా ఉంటే అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటారని నోటికి వచ్చింది మాట్లాడితే ఎవరూ ఊరుకోరని ఈ సందర్భంగా పలువురు ఆయను హెచ్చరించారు.

జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపూరం, అనంతపురం, కడప)
చైతన్యరథం





# ఇక నిరంతరాయంగా మెగా జాబ్ మేళా

## సద్వినియోగం చేసుకోవాలని యువతకు మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపు

అనంతపురం, చైతన్యరథం : ఇక నిరంతరాయంగా మెగా జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. నిరుద్యోగులకు జాప్యం లేకుండా ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉరవకొండ పట్టణంలోని ఎస్ కే జూనియర్ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ మెగా జాబ్ మేళాకు 60కి పైగా కంపెనీలు వారి ప్రతినిధులను పంపారన్నారు. అ దాదాపు 5,000 మందికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ మేళాలో 7వ, 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారిపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. వెసులుబాటు ఉన్నవారు ఉద్యోగాన్వేషణలో బయట ప్రాంతాలకు వెళ్లగలుగుతున్నారన్నారు.

7వ, 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారు పోలేకపోతున్నారన్నారు. వారికి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. ఇది మొదలు మాత్రమేనని, ఇది నిరంతరాయంగా నిర్వహించాలని నిర్ణయించామని మంత్రి ప్రకటించారు. ఈ ప్రజలు వారి పిల్లల కోసం ఏమి కోరుకుంటున్నారో దానిని నెరవేర్చడమే లక్ష్యంగా పిల్లలను స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లకు పంపించి, ప్రభుత్వ ఖర్చులతో వారికి శిక్షణ ఇప్పించి వారికి ఉద్యోగాలు వచ్చేలాగా చేయడానికి తాము చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగం రానివారు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని మరిన్ని అవకాశాల కోసం నైపుణ్యతను పెంపొందించు కోవాలని తెలిపారు. వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి, మరింత మెరుగ్గా, సులభతరంగా, నాణ్యతతో, పారదర్శకంగా జాబ్ మేళాను నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలలో ఎంపికైన యువతి యువకులకు నియామక పత్రాలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు.

ఎంపికైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని దానిలో మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, ఉరవకొండ తహసిల్దార్ మహబూబ్ బాషా, ఆయా శాఖల అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు, పెద్ద ఎత్తున నిరుద్యోగులు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో టీడీపీ హవా

## 15 సాగునీటి స్థానాలు ఏకగ్రీవం



పుట్టపర్తి (చైతన్యరథం) : పుట్టపర్తి నియోజకవర్గంలో జరిగిన 15 సాగునీటి సంఘాల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు 15 స్థానాలను ఏకగ్రీవంగా దక్కించుకున్నారు. 15 మంది అధ్యక్షులతో పాటు ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అభినందించారు. ఈ సాగునీటి సంఘం ఎన్నికల్లో టీడీపీ తరపున గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ,డైరెక్టర్లు కు ఎమ్మెల్యే చేతుల మీదుగా పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు నియోజవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన అభినందన సభకు సాగునీటి సంఘాలకు ఎన్నికైన సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

# పులివెందులలో వైఎస్ కోటకు బీటలు

## - నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి వెల్లడి



పులివెందుల (చైతన్యరథం) : నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి మాట్లాడారు. 1978 నుంచి నిర్మించుకున్న వైఎస్ కుటుంబ సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకిలించామని ఈ ఘనత టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు చెందుతుందని పేర్కొన్నారు. పులివెందులలో రాజారెడ్డి రాజ్యాంగానికి తెరపడిందన్నారు. పులివెందుల నియోజకవర్గంలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు మీసం మెలేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ని ఇబ్బందులు పెట్టినప్పటికీ తమ పార్టీ అభ్యర్థులు ధైర్యంగా నామినేషన్ వెయ్యడానికి ముందుకువచ్చారన్నారు. ఆ పరిస్థితి తారుమారయిందన్నారు. ఇప్పుడు సాగునీటి ఎన్నికల సందర్భంగా వైసీపీకి చెందిన అభ్యర్థులు కనీసం నామినేషన్ వెయ్యడానికి కూడా తహసీర్దార్ కార్యాలయాల దరిదాపుల్లోకి కూడా రాలేదన్నారు. చేతగాని దద్దమ్మలు కాబట్టే సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ముందుకురాలేదన్నారు. మీరా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడేదని నిలదీశారు. సిగ్గులేకుండా ఎన్నికలను బహిష్కరించామని డప్పు కొట్టుకుంటున్నారన్నారు. ఇది ట్రైలర్ మాత్రమేనన్నారు. ముందుముందు స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలు సత్తా చూపిస్తామన్నారు.






కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి




# జాతరను తలపించిన జాబ్ మేళా



- రెట్టింపు సంఖ్యలో వచ్చిన కంపెనీ ప్రతినిధులు
- యువతకు అండగా ఉంటా
- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని



కళ్యాణదుర్గం, (చైతన్యరథం) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో కళ్యాణ దుర్గం ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే లక్ష్యం మేరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 200కు పైగా కంపెనీలతో చర్చించి ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని అన్నారు. యువత ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా మంచి కంపెనీలలో వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుని వారి భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కళ్యాణదుర్గం జ్ఞానభారతి పాఠశాలలో రెండవ రోజు మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు వచ్చిన యువత ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఇక్కడితోనే ఆగకుండా యువతకు పూర్తి స్థాయిలో ఉద్యోగ ఉపాధి కల్పించే వరకు జాబ్ మేళాలు నిర్వహించి వారికీ అండగా ఉంటామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలిపారు .

# 16న లోక్‌సభ ముందుకు ▶ వన్ నేషన్.. వన్ ఎలక్షన్ బిల్లు

ఢిల్లీ: దేశంలో జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులకు గురువారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 16న లోక్‌సభ ముందుకు వన్ నేషన్ -వన్ ఎలక్షన్ బిల్లు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి ఎన్నికల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేలా రాజ్యాంగ సవరణ బిల్లుకు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో అధికార భాజపా 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అనే కీలక ప్రణాళిక అమలుదిశగా ముందడుగు వేసింది.

మూడు కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన చట్టాలను రాజ్యాంగ సవరణ బిల్లుతో అనుసంధానించేందుకు, చట్టాలను సవరించడానికి ఒక సాధారణ బిల్లుతో సహా రెండు ముసాయిదా చట్టాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఇటీవల సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన రెండు బిల్లుల్లో ఒకటి రాజ్యాంగ సవరణ బిల్లు కాగా.. మరొకటి సాధారణ బిల్లు. మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లోని (పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూకశ్మీర్) అసెంబ్లీలకు సంబంధించిన చట్టాలను




సవరించేందుకు సాధారణ బిల్లును తీసుకొస్తున్నారు. క్యాబినెట్ ఎజెండాలో ఈ బిల్లులు లేకపోయినా ప్రధాని మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షాల పట్టుపట్టడంతో ఇవి ఆమోదం పొందాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతోపాటే స్థానిక ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ సిఫార్సు చేసింది. ఇందుకోసం రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టాలని సూచించింది. అయితే స్థానిక ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టిన కేంద్రం.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై తీసుకొచ్చిన బిల్లులకు ఆమోదం తెలిపింది. దీనికి 50శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సిన అవసరం లేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. స్థానిక ఎన్నికలనూ వాటితో కలిపి నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణతోపాటు 50శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

అయితే రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మద్దతు అవసరం. ఎన్డీయేకు అంత బలం లేదు. దీంతో ఇండియా కూటమిలోని కొన్ని పార్టీల మద్దతు తీసుకోవాల్సి ఉంటుంది. ఇది ఎలా సాధ్యమనేది బిల్లు ప్రవేశపెట్టినప్పుడు తేలుతుంది. 542 మంది సభ్యులున్న లోక్‌సభలో ఎన్డీయేకు 293మంది మద్దతుంది. ఇండియా కూటమికి 235 మంది సభ్యులున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే 361 మంది సభ్యుల మద్దతు అవసరం. బిల్లులపై సమగ్ర చర్చ జరగాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. వాటిని పార్లమెంటులో ప్రవేశపెట్టాక పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ ద్వారానే రాష్ట్రాల స్పీకర్లతో సంప్రదింపులు జరపాలని భావిస్తోంది.

# రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాంగ్రెస్ దెబ్బతీసింది

## ▶ లోక్‌సభలో ప్రత్యేక చర్చలో ప్రధాని మోదీ విమర్శ



ఢిల్లీ: భారత రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. ఎందరో మహానుభావులు కలిసి మన రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో మోదీ మాట్లాడారు. ప్రజాస్వామ్య పండుగను ఘనంగా నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశం గర్వపడే క్షణాలన్నారు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో రకాలుగా ప్రయత్నించిందని విమర్శలు గుప్పించారు.

"దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది. దేశాధ్యక్షురాలిగా ఆదివాసీ మహిళ ఎన్నికయ్యారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ గౌరవం దక్కాలి. మన రాజ్యాంగం.. మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. దేశం అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఈ దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలి. ప్రజల మధ్య ఐకమత్యం.. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం మనదేశ గొప్ప విధానం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వార్థపరులవల్ల అనేక కష్టాలు పడ్డాం. బానిస మనస్తత్వంతో ఉన్నవాళ్లు దేశాభివృద్ధికి ఆటంకం కలిగించారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు విషబీజాలు నాటారు అని మోదీ అన్నారు. -ఉపాధిని వెతుక్కుంటూ పేదలు పలు ప్రాంతాలకు వెళ్తారని, పేదలకు ఇబ్బంది లేకుండా వన్ నేషన్.. వన్ రేషన్ కార్డ్ విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. పేదలు ఎక్కడున్నా రేషన్ సులువుగా తీసుకోవాలి. ఆయుష్మాన్ కార్డు ద్వారా ఉచితంగా వైద్య చికిత్స అందిస్తున్నాం. డిజిటల్ ఇండియా దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళు తున్నాం. మన రాజ్యాంగం.. అన్ని భాషలను గౌరవించింది. రాష్ట్రాల మాతృభాషల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. మాతృభాషలో చదివిన పిల్లల్లో సమగ్ర వికాసం సాధ్యపడుతుంది" అని తెలిపారు.

**కాంగ్రెస్ చేసిన నష్టం అంతా ఇంతా కాదు**

మన రాజ్యాంగ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు, రాజ్యాంగ నిర్మాతల కృషిని మట్టిపాలు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. భిన్నత్వంలో ఏకత్వ భావనను ఆ పార్టీ అర్థం చేసుకోలేదు. రాజ్యాంగ శక్తి, ప్రజల ఆశీర్వాదం మాకున్నాయి. మా పరిపాలన చూసి ప్రజలు మూడుసార్లు మాకు అధికారం ఇచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు అండగా నిలిచారు. ఈ దేశాన్ని ఒకే కుటుంబం 55 ఏళ్లపాటు పాలించింది. ఆ కుటుంబం ఈ దేశానికి అనేక విధాలుగా నష్టం కలిగించింది. 1947నుంచి 1952 వరకు ఎన్నికైన ప్రభుత్వం మనకు లేదు. ఆ సమయంలో కుటుంబం ఈ దేశానికి చేసిన నష్టం అంతా ఇంతా కాదు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నించారు. రాజ్యాంగ మార్పుపై రాష్ట్రాల సీఎంలకు నెహ్రూ లేఖలు రాశారు. ఆయన తప్పు చేస్తున్నారని బాబూ రాజేంద్ర ప్రసాద్ కూడా చెప్పారు. ఎంతోమంది పెద్దలు సలహాలు ఇచ్చినా నెహ్రూ వినలేదు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు అనేకసార్లు ప్రయత్నించారని మోదీ వ్యాఖ్యానించారు.

**ప్రజల హక్కులు హరించారు**

ఆనాటి కాంగ్రెస్ నేతలు రాజ్యాంగానికి 75సార్లు సవరణలు చేశారు. ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులు హరించారు. వేలాది మందిని జైళ్లకు తరలించారు. కోర్టుల నోరు, పత్రికల గొంతు నొక్కేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదోన్నతిని కూడా అడ్డుకున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అనేక కుట్రలు పన్నారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ ముగ్గురూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీశారు. కీలక నిర్ణయాలు తీసుకునేది పార్టీ అధ్యక్షురాలు అని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు. ఇదే కాంగ్రెస్ పాలన తీరుకు నిదర్శనం" అని మోదీ విమర్శలు గుప్పించారు.

# ▶ అంత అత్యవసరమైతే ప్రభుత్వాన్ని రద్దు చేయండి

## 'జమిలి'పై లోక్‌సభలో అఖిలేష్ యాదవ్



ఢిల్లీ: సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వన్ నేషన్ -వన్ ఎలక్షన్ బిల్లును ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. ఇంత అత్యవసరంగా జమిలి ఎన్నికల బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీకి అంత తొందర ఉంటే వెంటనే ప్రభుత్వాన్ని రద్దు చేసి.. ఎన్నికలు నిర్వహించాలన్నారు.

ఈనెల 16న లోక్‌సభ ముందుకు వన్ నేషన్ -వన్ ఎలక్షన్ బిల్లు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి ఎన్నికల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. అయితే ఈ ప్రతిపాదనపై ప్రతిపక్ష నేతలనుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్‌సింగ్ మాట్లాడుతూ సాధ్యాసాధ్యాలను చర్చించారు. "జమిలి ఎన్నికలు జరిగిన ఆరునెలల అనంతరం ఏదైనా రాష్ట్రంలో వివిధ పరిస్థితుల వల్ల ప్రభుత్వం మెజారిటీని కోల్పోతే రాబోయే నాలుగేళ్లపాటు రాష్ట్రాన్ని ఎవరు పరిపాలిస్తారు" అని ప్రశ్నించారు. ఈ విధానం ఆచరణ సాధ్యం కాదన్నారు. ఈ బిల్లు ఫెడరలిజం, ప్రజాస్వామ్య సూత్రాలకు విఘాతం కలిగిస్తోందని.. దీనిని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ డిమాండ్ చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు తమ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పంపిన వివరణాత్మక లేఖను ఉటంకిస్తూ.. ఈ ఆలోచనను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని పునరుద్ఘాటించారు.

# రాజ్యాంగాన్ని చూస్తే ▶ వాళ్ల ఆలోచనలే కనిపిస్తాయి

లోక్‌సభలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు



ఢిల్లీ: రాజ్యాంగంపై హిందుత్వ సిద్ధాంత కర్త వీడీ సావర్కర్ గతంలో చేసిన వ్యాఖ్యలను లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో మాట్లాడుతూ.. అధికార ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాజ్యాంగం, మనుస్మృతి మధ్య వైరుధ్యాన్ని వివరించారు. మనుస్మృతి సిద్ధాంతాలను అనుసరించి రాజ్యాంగం ఉండాలని సావర్కర్ విశ్వసించారని, కానీ, రాజ్యాంగాన్ని తెరచినప్పుడు అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్లాల్ నెహ్రూల ఆలోచనలు, వారి మాటలు అందులో కనిపిస్తాయన్నారు.

రాజ్యాంగంపై శుక్రవారం జరిగిన చర్చలో కేంద్ర మంత్రి రిజిజు మాట్లాడుతూ.. చారిత్రక లోపాలను దాచిపెట్టి, అప్పటి కాంగ్రెస్.. రాజ్యాంగ అంశాలను ఎంపిక చేసిందని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల కాంగ్రెస్ వ్యవహరించిన తీరును విమర్శిస్తూ శనివారం చర్చను ప్రారంభించారు. దీనిపై రాహుల్ తీవ్రంగా మండిపడ్డారు. "రాజ్యాంగం ఆధునిక భారతావనికి సంబంధించిన ఓ డాక్యుమెంట్. కానీ, ప్రాచీన భారత విలువలూ అందులో ఉన్నాయి. సావర్కర్.. రాజ్యాంగాన్ని విమర్శిస్తే.. మీరు రాజ్యాంగ రక్షణ గురించి మాట్లాడుతున్నారు. మీ ఆత్మబంధువును అవహేళన చేసినట్టు అనిపించడం లేదా?" అని రాహుల్ చురకలంటించారు.

**ఉద్యోగార్థులకు మొండి చేయి**

గత పదేళ్లలో ఎన్డీయే ప్రభుత్వ చర్యలవల్ల వేలాది ఉద్యోగార్థులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. "దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 70 పరీక్ష పేపర్లు లీకయ్యాయి. దీంతో ప్రతిభావంతులైన వేలాది మంది ఉద్యోగాలు సాధించలేకపోయారు. దీనంతటికీ బాధ్యులెవరు? ఇటీవల హాథ్రస్ సామూహిక అత్యాచార బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించాను. నేరానికి పాల్పడినవారు నిర్భయంగా వీధుల్లో తిరుగుతున్నారు. బాధితులు మాత్రం ఇంటినుంచి బయటకు రాలేని పరిస్థితి. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పిస్తోంది. భాజపా మాత్రం దానిపై దాడి చేస్తూనే ఉంది' అని రాహుల్ ఆరోపించారు.

భారత్‌లో ప్రస్తుతం యుద్ధం జరుగుతోందని చెబుతూ.. ద్రోణాచార్యుడికి ఏకలవ్యుడు తన బొటన వేలిని గురుదక్షిణగా ఇచ్చిన కథను రాహుల్ ప్రస్తావించారు. "అదానికి 'ధారావి' ప్రాజెక్టును అప్పగించినప్పుడే.. అక్కడి చిన్న, మధ్య తరహా వ్యాపారుల బొటనవేళ్లను ప్రధాని మోదీ కోసేసినట్లయింది. తాజాగా గిట్టుబాటు ధర అడిగిన రైతులపై బాష్పవాయువు ప్రయోగించారు. ఇంతకంటే దారుణం మరొకటి ఉంటుందా?" అని రాహుల్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కచ్చితంగా కులగణన చేపడతామని పునరుద్ఘాటించారు.

# ▶ అద్వానీకి అస్వస్థత



ఢిల్లీ: భాజపా అగ్రనేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం ఆయనను ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

అద్వానీ ఆరోగ్యం క్షీణించడంతో రెండు రోజుల క్రితమే ఆయనను ఆసుపత్రిలో చేర్పించినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. 97 ఏళ్ల వయసులో ఉన్న ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతున్నారు. ఈ ఏడాది ఆగస్టులో కూడా అపోలోలో చికిత్స తీసుకున్నారు. 1927 నవంబరు 8న అవిభక్త భారత్‌లోని కరాచీ (ప్రస్తుతం పాకిస్థాన్లో ఉంది)లో జన్మించిన అద్వానీ సుదీర్ఘకాలం భాజపాలో పనిచేసి వివిధ హెూదాల్లో సేవలందించారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆయనను దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'తో సత్కరించింది.